
నోటీసులు చూపుతున్న గ్రామస్థులు

పాఠశాలల బలోపేతం బాధ్యత గురువులదే

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యతను గురువులే తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని అర్చనా విద్యా సంస్థల్లో జరుగుతున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా మారి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచడానికి తమవంతు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, వాటిని చక్కగా అమలు చేసి అంకిత భావంతో ఉపాధ్యాయులు పనిచేసి ప్రభుత్వ విద్యకు మంచిపేరు తీసుకురావాలన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు చట్టం తీసుకురావడం హర్షణీయమన్నారు. నాలుగు డీఎల్ పెండింగ్ ఉన్నాయని, పీఆర్సీ ఇప్పటికే ఆలస్యమైందని, విద్యాశాఖ మంత్రితో, ముఖ్యమంత్రితో చర్చించి వాటి విడుదలకు ప్రయత్నించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ నేతలు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషాచలం అడవుల్లో కూంబింగ్

● స్మగ్లర్లు పరార్, సామగ్రి స్వాధీనం


కూలీల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాగులతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సుండుపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్లకు సంబంధించిన మూడు బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్వో రమేశ్‌బాబు తెలిపారు. గురువారం ముడుంపాడు బీట్‌లోని సుబ్బయ్యకుంట ప్రాంతంలో ఎర్రచందనం కూలీలు ఉన్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా సుమారు 20 మంది పరారు కాగా వారికి చెందిన మూడు బ్యాగులను స్వాధీనం చేసుకున్నామని, వారిని పట్టుకునేందుకు కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో, సమీపంలోని మామిడి తోటల్లో ఎర్రచందనం దుంగల కోసం గాలించామన్నారు. ముడుంపాడు బీట్ ఎఫ్‌బీవో అంజనస్వామి, గౌసియా, 15 మంది ప్రొటెక్షన్ వాచర్లు కూంబింగ్‌లో పాల్గొన్నారు.

325 మందికి రుణాలకు ప్రతిపాదనలు

● బెల్టుషాపులపై ఉక్కుపాదం
● ఎక్సైజ్ ఏఈఎస్ జోగేంద్ర


విలేకర్లతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏఈఎస్ జోగేంద్ర

మదనపల్లె టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవోదయం-2 పథకం కింద 325 మందికి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రుణాల మంజూరుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) జోగేంద్ర తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాటుసారా నిర్మూలన చర్యల్లో భాగంగా జిల్లాలో 71 నాటుసారా తయారీ గ్రామాలను గుర్తించామని, అందులో 55 గ్రామాల్లో నాటుసారా తయారీని కట్టడి చేశామన్నారు. మదనపల్లె డివిజన్‌లో 309 నాటుసారా విక్రయాలపై కేసులు నమోదు చేసి 208 మందిని అరెస్టు చేశామన్నారు. బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపేలా డివిజన్‌లో విస్తృతంగా దాడులు చేసి 30 మందిని అరెస్టు చేశామన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించేలా ప్రతి దుకాణం వద్ద నిబంధనల ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశామని, ఉల్లంఘనలు జరిగితే టోల్‌ఫ్రీ 14405 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, ఇది స్కాన్ చేస్తే ఎలాంటి ఫిర్యాదులైనా అందులో నమోదు చేస్తే నేరుగా కంట్రోల్‌రూమ్‌కు వెళతాయన్నారు. ఆగస్టు 31వ తేదీకి జిల్లా అంతటా నాటుసారా రహితంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భీమలింగ పాల్గొన్నారు.

ఊరు ఖాళీ చేయండి...

గ్రామంలో ఏదో ఒక ఇంటిని కాదు... ఏకంగా 40 ఇళ్లున్న ఊరినే ఖాళీ చేయాలంటూ కొందరు న్యాయవాది ద్వారా నోటీసులు పంపారు. 1994లో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఆ భూమి మాదని ఊరు ఖాళీ చేయాలని ఆ భూమి వారసులమని చెప్పుకునేవారు నోటీసులు పంపడంతో ఊరిని ఖాళీ చేసి తాము ఎక్కడికి వెళ్లాలని గ్రామస్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అధికారులే సమస్యను పరిష్కరించాలని పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె దళితవాడ గ్రామస్థులు కోరుతున్నారు.

● ఊరి ప్రజలకు ఖాళీ చేయమని నోటీసులు
● అధికారుల అలసత్వం.. ప్రజలకు సంకటం
● కాలనీ భూమి రికార్డులు మార్చని అధికారులు
● ఆ భూమి మాదేనంటూ వారసుల రంగప్రవేశం
● లబోదిబోమంటున్న కాలనీ వాసులు

పీలేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వాలు కాలనీలు ఏర్పాటు చేస్తుంటాయి. ప్రభుత్వ భూములు లేని చోట ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు తీసుకుని, వారికి పరిహారం అందించి, తదనంతరం ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి, రికార్డుల్లో నమోదు చేసి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తుంటాయి. అయితే పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ దళితవాడకు చెందిన రికార్డులను మార్చకపోవడంతో ఆ భూమి వారసులు ఇప్పుడు రంగప్రవేశం చేశారు. దళితవాడ ఉన్న స్థలం తమదేనని, అక్కడున్న వారందరూ ఖాళీ చేయాలని న్యాయవాది ద్వారా నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న దళితవాడ వాసులు అవాక్కవడమే కాకుండా ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు.

ఇళ్లు మంజూరు చేశారు... రికార్డులు మరిచారు

పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.820/1లోని 1.58 ఎకరాల విస్తీర్ణంలో 40 ఇళ్లున్న దళితవాడ ఉంది. అక్కడి వారు తరతరాలుగా గుడిసెల్లోనే ఉంటుండడంతో 1994లో అప్పటి ప్రభుత్వం వారికి పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఆ స్థలం ప్రైవేటు వ్యక్తుల పేరిట ఉండడంతో ఆ వ్యక్తులకు పరిహారం చెల్లించి వారికి ఇళ్లు మంజూరు చేసి వారికి యాజమాన్య పత్రాలు అందించింది. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలతో వారందరూ అక్కడ పక్కా ఇళ్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. పరిహారం అందించిన రెవెన్యూ అధికారులు, ఆ భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయడం మరిచారు. 1994 నుంచి నేటి వరకు కూడా ఆ భూమి ప్రైవేటు వ్యక్తుల పేరిటే ఉండడంతో ఇటీవల ఆ భూమి తమదేనంటూ వారసులు రంగప్రవేశం చేశారు. పలుమార్లు విన్నవించినా గ్రామస్థులు ఆ స్థలం ఖాళీ చేయడం లేదని, రెవెన్యూ అధికారులు కూడా తమకు సహకరించడం లేదని, ఆగస్టు 14వ తేదీలోపు ఆ స్థలాలన్నీ ఖాళీ చేయాలని ఇటీవల పీలేరుకు చెందిన ఓ న్యాయవాది ద్వారా 39 మంది గృహ యజమానులకు నోటీసులు జారీ చేశారు. పోస్టులో నోటీసులు అందుకున్న గ్రామస్థులు అవాక్కయ్యారు. 1994లో తమ గ్రామం ఉన్న భూయజమానులకు పరిహారం చెల్లించి మరీ ప్రభుత్వం తమకు పక్కా ఇళ్లు మంజూరు చేసిందని, ఇన్నేళ్ల తరువాత వారసులమని చెప్పుకుంటున్న వారు నోటీసులు ఇవ్వడం ఏమిటని వారు వాపోతున్నారు.


1994లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టా


1982లో పంచాయతీ కార్యాలయం జారీ చేసిన ఇంటి పన్ను డిమాండ్ రశీదు


బోడుమల్లువారిపల్లె దళితవాడ

గ్రామస్థులకు అండగా ఉంటాం

దళితవాడ వాసులకు నోటీసులు వచ్చిన మాట వాస్తవం. అయితే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాత రికార్డులు కూడా పరిశీలిస్తున్నాం. ఆ సమస్య గురించి కలెక్టర్‌కు తెలియజేశాం. ఆయన సూచనల మేరకు త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. దళితవాడ వాసులకు అండగా ఉంటాం.

- శివకుమార్, తహసీల్దారు, పీలేరు

తరతరాలుగా ఇక్కడే ఉంటున్నాం!



నా వయస్సు 85 ఏళ్లు. నేను ఇక్కడే పుట్టి పెరిగాను. మా నాన్న, తాత కూడా ఇక్కడే పుట్టి పెరిగారు. 1994లో ప్రభుత్వం మాకు పక్కా ఇళ్లు ఇస్తామని చెప్పి శాంక్షన్ చేశారు. లోను కూడా ఇప్పించారు. ఆ టైంలోనే భూమి గలోళ్లకు గవర్నమెంటు డబ్బు కూడా ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరూ మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. ఇప్పుడు ఆ భూమి వారసులమని, మా ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు రావడం ఆశ్చర్యంగా ఉంది. ఇల్లు, వాకిలి, గొడ్డూగోదా వదులుకుని యాడికి పోయేది. మమ్మల్ని గవర్నమెంటే ఆదుకోవాలి.

- చిన్నరెడ్డప్ప

అధికారుల చెంతకు...

రెవెన్యూ అధికారులు దళితవాడలో బుధవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో నోటీసులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూఅనుభవంలో లేని వ్యక్తి నోటీసులు ఎలా ఇచ్చాడంటూ అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వారసత్వంగా వచ్చిన ఇల్లు మాది - నాగరాజ



నా వయస్సు 55 సంవత్సరాలు. నేను ఇక్కడే పుట్టి పెరిగాను. తాపీ మేస్త్రీగా పనిచేసుకుంటున్నాను. మా నాయన మాకు ఇచ్చిన ఇంటిలోనే ఉంటున్నాము. ఇప్పుడు ఆ ఇల్లు, స్థలం మాది కాదని నోటీసులు వచ్చాయి. ఏం చేయాలో తెలియక ఆఫీసర్లకు చెప్పాము. వారు న్యాయం చేస్తామన్నారు. అయినా ఊరు మొత్తం ఖాళీ చేయమని అడగడం ఎంతవరకు న్యాయమో తెలియడం లేదు.

అధికారులు తక్షణమే రికార్డులు సరిదిద్దాలి



గతంలో మా కాలనీకి భూమి తీసుకున్నప్పుడు భూయజమానులైన వారికి పరిహారం అందించినట్లు పక్కా రికార్డులు ఉన్నాయి. కాలనీ ఏర్పాటు చేశాక భూరికార్డులు మార్చాల్సిన అధికారులు 31 ఏళ్లుగా దాని గురించి పట్టించుకోకపోవడం చాలా అన్యాయం. ఇది ముమ్మాటికీ అధికారుల తప్పిదమే కాబట్టి వారు సమస్యను పరిష్కరించాలి. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్‌ను కలుస్తాం.

- భానుప్రకాశ్, డీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు

ఆలస్యంగా నడిచిన ప్యాసింజర్ రైళ్లు

ములకలచెరువు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే మూడు ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కదిరిదేవరపల్లె నుంచి తిరుపతికి నడిచే ప్యాసింజర్ రైళ్లు గురువారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కదిరిదేవరపల్లె నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి రాత్రి నడిచే ప్యాసింజర్ రైలు మూడు గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరువుకు అర్ధరాత్రి 11.04 గంటలకు రావాల్సి ఉండగా 2.14 గంటలకు వచ్చింది. గుంతకల్లు నుంచి తిరుపతికి ఉదయం నడిచే రైలు ములకలచెరువుకు ఉదయం 11.54 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 1.10 గంటలకు వచ్చింది. తిరుపతి నుంచి గుంతకల్లుకు నడిచే రైలు ఉదయం 9.34 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 11.30 గంటలకు వచ్చింది. మూడు ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాశారు.

అభ్యర్థి ఎంపికపై మంత్రి మంతనాలు

● ఇన్‌చార్జ్ మంత్రి జనార్దన్‌రెడ్డికి స్వాగతం పలికిన నాయకులు

ఒంటిమిట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మండల నాయకులతో చర్చలు జరిపారు. గురువారం మధ్యాహ్నం ఆయన ఒంటిమిట్టకు విచ్చేసి మండల నాయకులతో, పోటీదారులుగా ఉన్న అభ్యర్థులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీదారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని, అలాగే మండల నాయకుల అభిప్రాయాలు కూడా తెలుసుకున్నామన్నారు. ఈ నివేదికను అధిష్ఠానానికి తెలియచేస్తామని, అధిష్ఠానం శుక్రవారం ఉదయం అభ్యర్థి పేరును ప్రకటిస్తుందన్నారు. ఆరోజే నామినేషన్ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, మండల నాయకులు కొమరా వెంకటనరసయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, పార్టీ నాయకులు బొడ్డే వెంకటరమణ, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాల మునెయ్య తదితరులు పాల్గొన్నారు.


మంత్రి జనార్దన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జగన్‌మోహన్‌రాజు, తదితరులు

వైభవం.. రాముడి పట్టాభిషేకం


● గరుడునిపై పట్టాభిరాముడి నగరోత్సవం


రాముడికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం విశేష సేవల అనంతరం ఆలయంలోని మండపాన్ని అలంకరించి సీతా లక్ష్మణ సమేత పట్టాభిరాములను అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల నడుమ పట్టాభి రాముడికి కిరీటధారణ చేసి పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి విశేషాలంకృతుడైన పట్టాభిరాముడిని గరుడ వాహనంపై పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేశ్, ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు, వేదపండితులు కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోకుల్, భాషికాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భగ్గుమన్న బొప్పాయి రైతు

● ప్రధాన దారిలో వరిగడ్డి కాల్చి లారీల అడ్డగింత
● స్తంభించిన వాహన రాకపోకలు
● దళారుల ఇళ్లను ముట్టడించిన రైతులు
● రంగప్రవేశం చేసిన పోలీసులు


రైల్వేకోడూరులో దళారీ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బొప్పాయి రైతులు

బొప్పాయి రైతులు రోడ్డెక్కారు. దళారులు బొప్పాయి ధరలను రోజురోజుకు తగ్గిస్తూపోతుండటంతో గురువారం రైల్వేకోడూరులోని ప్రధాన రహదారిపై వరిగడ్డి కాల్చి లారీలను అడ్డుకున్నారు. దళారుల ఇళ్లను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కలుగచేసుకుని రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

-వివరాలు 6లో

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు

● అన్నదాత సుఖీభవకు సిద్ధంగా ఉండాలి
● కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని, ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు బదిలీ కార్యక్రమం జరుగుతుందని అన్ని జిల్లాల కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. అన్నా క్యాంటీన్లలో ఆహారం నాణ్యత క్యాంటీన్ నిర్వహణ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ మహిళలకు పోలీసులు అందించే భద్రత, మాదక ద్రవ్యాల సమస్య లేకుండా చేయడం వంటి అంశాల్లో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నీటి వనరుల మరమ్మతులు, పునరుద్ధరణ కార్యక్రమంలో జిల్లాలోని నీటి వనరుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ
ప్రతి ఒక్కరి బాధ్యత
జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం


డైట్ కేంద్రంలో మొక్క నాటుతున్న డీఈవో అధ్యాపకులు

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం అన్నారు. గురువారం ఉదయం డైట్ మైదానంలో 175 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మొక్కల పెంపకం అత్యావసరమని, దాని కోసం ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. భూతాపం తగ్గించడానికి ప్రపంచ వ్యాప్తంగా మొక్కలు పెంచాలన్నారు. ప్రాథమిక బాధ్యతలో భాగంగా మొక్కలకు కొంచెం స్థలం వదిలివేసి ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. రోడ్ల వెంబడి, పాఠశాలల్లో, బంజరు భూముల్లో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే తరాల ఆశలను, ఆకాంక్షలను, అవసరాలను తీర్చాలంటే మనం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిలాజ ఇంధనాల వాడకం తగ్గించి, వాటి స్థానంలో సౌరశక్తి బయోగ్యాస్ లాంటి ఇంధనాలను వాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు ఉషామాధురి, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కలీముల్లా, శివప్రసాద్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు


నిమ్మనపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో గుంపుగా వెళ్లి కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో తనిఖీ చేసిన వైసీపీ నేతలపై గురువారం పాఠశాల ఛైర్మన్ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సోమవారం మధ్యాహ్నం సర్పంచ్ చెంగ్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌తో కలిసి దాదాపు 8 మంది వైసీపీ, నేతలు ఎలాంటి అనుమతులు లేకుండా బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారన్నారు. అంతేకాక మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై హాస్టల్ ఉపాధ్యాయులు ఎవరని అడగగా తాము వైసీపీ రాష్ట్ర విద్యార్థి సెక్రటరీ అని తమను హాస్టళ్ల తనిఖీ చేపట్టమని జగన్ తెలపడంతో వచ్చామని చెప్పడంతో వారు అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. అనంతరం వైసీపీ నేతలు సోషల్ మీడియాలో హాస్టల్ తనిఖీపై పోస్టులు పెట్టారని తెలిపారు. దీనిపై అనుమతుల లేనిదే బయటి వ్యక్తులు హాస్టల్ వద్దకు రాకుండా రక్షణ కల్పించి వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

వివాదాస్పద భూమిలో సర్వే


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

కురబలకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ యూనివర్సిటీ పక్కన ఉన్న విలువైన వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్-220లో 69.42 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో ఆ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు 145 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం కొన్నేళ్ల పాటు ఈ భూమిలోకి ఎవరూ వెళ్లలేదు. అయితే వైసీపీ ప్రభుత్వంలో 145 సెక్షన్‌ను రద్దు చేయడంతో ఈ భూమిని ఆక్రమించుకోవడానికి పులివెందుల వాసులు ప్రయత్నించారు. దీంతో అప్పట్లో వివాదం నెలకొంది. అయితే ప్రభుత్వం మారడంతో వివాదం మళ్లీ మొదటకొచ్చింది. ఈ నేపథ్యంలో గత ఏడాది తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా భూహక్కుదారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతికి చెందిన చల్లా వెంకటేశ్వరు 3.15 సెంట్ల భూమికి హద్దులు చూపాలని దరఖాస్తు చేసుకోడంతో తహసీల్దార్ ధనంజయులు, సర్వేయర్ భువనేశ్వరి ఆ సర్వే నెంబర్ భూహక్కుదారులకు నోటీసులు అందజేసి సర్వే చేశారు. కాగా సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ భారీ బందోబస్తును నిర్వహించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న
ఎంఈవోలపై చర్యలు తీసుకోండి
డీఈవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కిచెన్ గార్డెన్ల నిర్వహణలో విధులు సక్రమంగా నిర్వహించని ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ్, ఏపీఎస్ జేఏసీ రాయలసీమ జిల్లాల కన్వీనర్ ఉత్తన్న డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేయడంతో పాటు, ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కిచెన్ గార్డెన్ల కోసం ప్రభుత్వం జిల్లాలో ఉన్న కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి, ఒక్కొక్క పాఠశాలకు రూ.5 వేలు మంజూరు చేసిందన్నారు. మంజూరు చేసిన నిధులను జిల్లా విద్యాశాఖ అధికారి మార్చి, ఏప్రిల్ నెలల్లో మండల విద్యాశాఖ అధికారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినా, ఆ నిధులను సంబంధిత వినియోగంలో మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. ముఖ్యంగా మదనపల్లె డివిజన్ పరిధిలోని కొన్ని పాఠశాలలు మాత్రమే నామమాత్రంగా సొంత నిధులతో గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. నిధులు జమ చేసిన పాఠశాలల్లో వాటిని ఏమాత్రం ఉపయోగించకుండానే ఉపయోగించినట్లుగా డీఈవోకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇచ్చారన్నారు. ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భగ్గుమన్న బొప్పాయి రైతు

- ప్రధాన దారిలో వరిగడ్డి కాల్చి లారీల అడ్డగింత
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- దళారుల ఇళ్లను ముట్టడించిన రైతులు
- రైతులపై పోలీసుల దురుసు ప్రవర్తన


రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరి గడ్డిని కాల్చిన రైతులు

రైల్వేకోడూరు/రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలను ఉన్నపళంగా తగ్గించడంతో గురువారం తెల్లవారుజామున రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను రైతులు అడ్డుకుని ప్రధాన దారిలో ఆందోళన చేశారు. దళారుల ఇళ్లను ముట్టడించారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె, కోడూరు ఎస్ఐలు మహేశ్, వీఎల్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ఆగ్రహించిన రైతులతో పోలీసులు చర్చలు జరిపారు. ఉన్నపళంగా దళారులు బొప్పాయి టన్ను రూ.7 వేలు తగ్గించారని, వరుసగా ధరలను తగ్గించుకుంటూ పోతున్నారని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులతో ఒకవైపు చర్చలు జరుగుతుండగానే చాలామంది రైతులు దళారుల ఇళ్ల వద్ద మళ్లీ ఆందోళన చేశారు. బొప్పాయి ధరలు పెంచినంత వరకు కాయలు కోసేది లేదని, లారీలను తోటల్లోకి రానివ్వమని తెగేసి చెప్పారు. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ప్రధానదారి పొడవునా రైతులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. చిట్వేలి రోడ్డులో గడ్డి కాల్చుతున్న ఓ రైతును పోలీసులు కొట్టారని, అలాగే సీఐ హేమసుందరరావు భూమా శివకేశవరెడ్డి అనే రైతుపై దురుసుగా ప్రవర్తించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రైతులకు అండగా ఉండాలనేగాని చేయి చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సీఐ మాట్లాడుతూ కావాలనే రైతులపై చేయి చేసుకోలేదని, రైతులు ఎక్కడ లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగిస్తారోనని కట్టడి చేయడానికి మాత్రమే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. దళారులు మోసాలు చేసి రైతులను నిలువునా నాశనం చేస్తున్నారని సబ్ కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బొప్పాయి సాగు చేస్తే దళారుల మాటలు విన్న మార్వాడీలు ధరలు తగ్గిస్తున్నారని రైతులు మండిపడ్డారు.

బొప్పాయికి ధరలు బాగా ఉన్నా రైల్వేకోడూరులో మాత్రం ధరలు తగ్గించి మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు రైతులను నచ్చచెప్పి రెవెన్యూ కార్యాలయం వద్దకు రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే రైతులతో మాట్లాడుతూ మీకు సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలే కానీ ఇలా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి విషయం తెలుసుకుని కోడూరు రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొప్పాయి రైతులకు అండగా ఉంటామని, ధరల పెరుగుదలకు కృషి చేస్తామన్నారు. సమావేశం లోనే కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ స్పందించి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కోడూరుకు వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తామని తెలిపారు. దీంతో రైతులు శాంతించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, డిప్యూటీ ఎన్నికల తహసీల్దార్ గల్లా రమణలు రైతుల సమస్యలపై నివేదిక సిద్ధం చేశారు. అయితే బొప్పాయి రైతుల ఆందోళన సందర్భంగా కొందరు వ్యక్తులు సందట్లో సడేమియా అంటూ మార్వాడీ ఇంటిలోకి ప్రవేశించి రూ.70 వేలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. కొందరు మార్వాడీలు, దళారులపై పలువురు దాడికి దిగినట్లు తెలిపారు.



రైల్వేకోడూరు ప్రధాన దారిలో ఆందోళన చేస్తున్న బొప్పాయి రైతులు


రైతును చేత్తో నెట్టివేస్తున్న సీఐ హేమసుందరరావు


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

ఉపాధి బిల్లుల బకాయి రూ. 2.14 కోట్లు

- 217 ఎకరాలతో ఉద్యాన పంటల సాగు
- 100 ఎకరాల్లో గడ్డి పెంపకం



పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులకు పీలేరు మండలంలో రూ.2.14 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా డబ్బులు కూలీల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఉపాధి బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉంది. ఉన్న బకాయిలలో కూలీలకు రూ.1,32,68,593 చెల్లించాల్సి ఉంది. అలాగే సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణంలో మెటీరియల్ కోసం రూ. 81,67,814 పెండింగ్ బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మెటీరియల్ బిల్లులు గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసిన వారు బిల్లులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు. పీలేరు మండలంలో ప్రస్తుతం 217 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు, 100 ఎకరాల్లో గడ్డి పెంపకం, పలు పంచాయతీల్లో సప్లయ్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఇవే కాకుండా మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయి.

ప్రతి ఒక్కరికీ పనులు



పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ స్థానికంగా ఉపాధి పనులు చూపిస్తున్నాము. ఏ ఒక్కరూ స్థానికంగా పనిలేదని అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఎంతమంది అయినా స్థానికంగానే ఉపాధి పనులు చేసుకోవచ్చు. చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్ చేశాము. వచ్చిన వెంటనే కూలీల అకౌంట్లలో జమ అవుతాయి.

అశోక్‌రెడ్డి, ఏపీవో, పీలేరు.

ఏఎస్ఐ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి : ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాసులు సేవలను పోలీసు యంత్రాంగం ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్ఐ శ్రీనివాసులుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్ఐ శ్రీనివాసులు అంకితభావంతో అహర్నిశలు సేవలందించారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే అవసరమైనప్పుడు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఆర్ఐ వీజే రామకృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసిరాం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేశ్, కె.రాజారెడ్డి, ఆర్ఎస్ఐ బి.అమర్‌నాథరెడ్డి, ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఏఎస్ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎస్పీ

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

ఒంటిమిట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ఎ.అర్జున్(66) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. ఇతను చిత్తూరు జిల్లా నారాయణవనం మండలం జీఎన్ కండ్రిగకు చెందిన వ్యక్తి. బుధవారం ఉదయం తిరుపతి నుంచి ఇంటర్‌సిటీ రైల్లో వచ్చి ఒంటిమిట్టలో దిగాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం పొంది తిరిగి రైల్వేస్టేషన్‌కు వెళుతూ మార్గమధ్యలోనే ఈద్గా వద్ద మృతి చెందాడు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న వ్యక్తులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఉన్న సెల్ నెంబరు ఆధారంగా పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

వృద్ధురాలి మృతి అనుమానాస్పదం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రింగురోడ్డు సమీపంలో వండాడి సరోజమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్న వండాడి చిన్నవెంకటప్ప భార్య సరోజమ్మ (70) మంగళవారం నుంచి కనిపించకుండాపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు.

ఈ క్రమంలో గున్నికుంట్ల రింగు రోడ్డు సమీపంలోని గుట్టపైన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని తెలియజేయడంతో సరోజమ్మ కుమారుడు వెంకట్రమణ అక్కడికి చేరుకుని తల్లిని గుర్తించాడు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆశలన్నీ బాబుపైనే

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా గండికోట
- మూడేళ్లలో స్టీలు ప్లాంటు నిర్మాణం
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి
- కొప్పర్తిలో పరిశ్రమలకు పర్యావరణ అనుమతుల అడ్డంకి
- మహానాడు హామీలు అమలు చేయాలి

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాలో అటు పర్యాటకం, ఇటు నీటిపారుదల రంగం పడకేశాయి. చంద్రబాబు కడప జిల్లాకు వ్యతిరేకి అంటూ జగన్ అండ్ కో దుష్ప్రచారం చేస్తుంటారు. ఆ ప్రచారాన్ని తిప్పికొట్టే సువర్ణ అవకాశం ఇప్పుడు చంద్రబాబు చేతుల్లో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీతో పాటు గ్రాండ్‌కెనాన్‌గా గుర్తింపు పొందిన గండికోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

స్టీలు ఫ్యాక్టరీ

జిల్లావాసుల చిరకాల వాంఛ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం. ఇప్పటికే ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారు. అయినా అడుగు ముందుకు పడని పరిస్థితి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన బ్రాహ్మణీ స్టీలు ప్లాంటు నిర్మాణం అటకెక్కింది. చంద్రబాబు 2018లో మైలవరం మండలంలో శంకుస్థాపన చేసినా అనంతరం ఆయన అధికారం కోల్పోవడంతో అదీ ఆగిపోయింది. జగన్ అధికారంలోకి వచ్చాక సున్నపురాళ్లపల్లె వద్ద రెండుసార్లు శంకుస్థాపన చేశారే కానీ స్టీలు ప్లాంట్ నిర్మాణం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మహానాడులో చంద్రబాబు చెప్పిన విధంగా సున్నపురాళ్లపల్లె వద్ద స్టీలు ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి వెయ్యిమందికి ఉపాధి కల్పించేలా పనులు ముమ్మరం చేయాల్సి ఉంది.

కడపలో తాగునీటి ఎద్దడి

కడప కార్పొరేషన్‌లో వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈసారి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పక్కా ప్రణాళికతో సగం డివిజన్లలో రోజూ నీళ్లు ఇచ్చేలా చేశారు. కడపలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడి నివారణ కోసం గత టీడీపీ హయాంలోనే రూ.75 కోట్లతో లింగంపల్లె వద్ద సర్ఫేజ్ చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అది నిలిచిపోయింది. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తమకు తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రైల్వేలైను

కడప నుంచి దూరంలో ఉన్న చెన్నై, హైదరాబాదు నగరాలకు రైలు ఉంది కానీ దగ్గరలో ఉన్న బెంగళూరుకు లేదు. కడప-బెంగళూరు రైల్వే లైను జిల్లావాసుల చిరకాల వాంఛ. జగన్ హయాంలో ఐదేళ్లూ ఆ ప్రాజెక్టును అటకెక్కించారు.

ఇటీవల కేంద్రం దాదాపు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో చంద్రబాబు మార్కు చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి నత్తనడకన సాగుతోంది. మహానాడు సందర్భంగా జీఎన్ఎస్‌కు రూ.1000 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ పూర్తి చేసి త్వరగా నిర్మాణం చేపట్టాలి. ఇక జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు సాగడంలేదు. సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లకు సంబంధించి పెండింగు పనులు ఉన్నాయి. బ్రహ్మంసాగర్ లీకేజీ అలాగే ఉంది. వీటిన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సి ఉంది.

గండికోట



గండికోటలో సహజ సిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయ, ఇక్కడున్న అద్భుతమైన కట్టడాలు గొప్ప వారసత్వ సంపద. గండికోట వైభవం అందరికీ తెలిసేలా 2014-2019లో సీఎం చంద్రాబు నాయుడు ప్రభుత్వం ఇక్కడ ఉత్సవాలు నిర్వహించింది. సొంత జిల్లా వాసి జగన్ సీఎం అయిన తరువాత గండికోట అభివృద్ధిని గాలికి వదిలేశారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో గండికోటకు ప్రాధాన్యం లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రూ.165 కోట్ల విలువైన అభివృద్ధి పనులను శుక్రవారం సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొప్పర్తి



వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో ఓ బ్లాక్‌ను కేంద్రం నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఇప్పటికే కొన్ని పరిశ్రమలున్నాయి. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు అడ్డంకిగా ఉందని చెబుతున్నారు. కేంద్రంలోనూ ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో పర్యావరణ అనుమతులు తెచ్చుకుంటే పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

ఇక ఆటో మ్యుటేషన్

● రిజిస్ట్రేషన్ అయినరోజే మ్యుటేషన్ పూర్తి

● నేటి నుంచి కార్పొరేషన్ పరిధిలో అమలు

కడప కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏవైనా స్థిరాస్థులకు రిజిస్ట్రేషన్లు జరిగితే పేర్ల మార్పునకు మ్యుటేషన్ చేసుకోవాలంటే రెవెన్యూ, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. వాళ్ల డిమాండ్ మేరకు సమర్పించుకుంటే సరి. లేదంటే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిందే. ప్రజలకు ఈ ఇబ్బందులు లేకుండా చేసేందుకు కూటమి సర్కారు ఆస్థి యాజమాన్య బదిలీని సులభతరం చేసింది. దీంతో ఇన్నాళ్లు సాగిన అవినీతి వ్యవహారాలకు చెక్ పడనుంది. రాష్ట్రంలో 17 కార్పొరేషన్ల పరిధిలో ఆటో మ్యుటేషన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కడప కార్పొరేషన్‌లో 1వ తేదీ శుక్రవారం నుంచి ఆటో మ్యుటేషన్ అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

గతంలో మ్యుటేషన్ అంటే కాసుల పండగే

కొనుగోలు చేసిన స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ వారి పేరు మార్పు (మ్యుటేషన్) చేసుకోవాలంటే కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు రకరకాల కొర్రీలు వేస్తూ చుక్కలు చూపించేవారు. ఇంటి పన్నులు, కుళాయి రశీదుల్లో పేరు మార్పు కోసం ఆస్తుల మార్కెట్ వాల్యూలో 1శాతం మ్యుటేషన్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాలి. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయంలో డాక్యుమెంట్లు పరిశీలించిన అనంతరం ఆర్ఐ, ఆర్వో లాగిన్‌ల నుంచి కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. ఇక్కడ నుంచే అవినీతి సిబ్బంది ఆటలు మొదలవుతాయి. నిబంధనల మేరకు 14 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. కానీ దళారులను రంగంలోకి దింపి తాము కోరిన ముడుపులు ఇచ్చేదాకా నెలల తరబడి సాగదీస్తూ వచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు మ్యుటేషన్లలో అవినీతికి చెక్ పెడుతూ ఏ రోజైతే ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేసుకుంటారో అదే రోజున కొనుగోలుదారుల పేరుతో ఆటో మ్యుటేషన్ జరిగేలా తీసుకున్న నిర్ణయంతో స్థిరాస్థిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరోజులోనే ఆటో మ్యుటేషన్



కార్పొరేషన్ పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగిన రోజే ఆస్తి యాజమాన్య బదిలీకి సంబంధించి ఆటో మ్యుటేషన్ పూర్తి అవుతుంది. దాన విక్రయ, పరివర్తన దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్థి పూర్తి స్థాయిలో బదలాయింపు జరుగుతుంది. స్థిరాస్తిదారులకు సంబంధించిన ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక సీడీఎంఏ డేటాను రూపొందించింది. దీంతో భవిష్యత్తులో ఆస్థి వివాదాలు తగ్గుతాయి. పాత డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్లకు పూర్తి బ్రేక్ పడనుంది.

- పీవీఎన్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

సీడీఎంఏ డేటాలో ఆస్థి వివరాలు నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ పరిధిలో ఆస్థుల రిజిస్ట్రేషన్లు, ఆటో మ్యుటేషన్ విధానంలో పారదర్శకత పాటించనుంది. ఒక ఆస్థి కొనుగోలు తరువాత యాజమాన్య బదలాయింపు వివరాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డేటా బేస్‌లో భద్రపరచనుంది. గతంలో 40-50 ఏళ్లనాటి ఇళ్లకున్న పాత డోర్ నెంబర్లపై అక్రమ ఆస్థుల రిజిస్ట్రేషన్లు సాగేవి. ఇవి కోర్టు వివాదాలకు దారి తీసేవి. ఆటోమ్యుటేషన్ ద్వారా ఇప్పుడు అలాంటి డోర్ నెంబర్లను ఆన్‌లైన్ సిస్టం గుర్తించదు. దీంతో పాత కాలం నాటి మనుగడలేని డోర్‌నెంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్ పడనుంది. ఇక ఆటో మ్యుటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఆస్తి విలువను బట్టి ఆన్‌లైన్ సిస్టం ద్వారా లెక్కించిన ఫీజును వసూలు చేయనుంది. ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లను, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారునికి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునే విధంగా (సీడీఎంఏ) ఏపీ ఇంటిగ్రేటెడ్ కచ్చితమైన ఆస్థి డేటాను అందించేలా రూపొందించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



లోకేష్ (కడప)

కడప స్పోర్ట్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆటకు చివరి రోజైన గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ కాగా, కడప జట్టు 53.3 ఓవర్లలో 158 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి మూడో రోజు బ్యాటింగ్‌కు దిగి 84.4 ఓవర్లలో 325 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ జట్టులోని ఆదినారాయణరెడ్డి 156 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 67.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. ఇందులో లోకేష్ 85 పరుగులు చేశారు. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం కర్నూలు జట్టు 100 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసిది. దీంతో చిత్తూరు జట్టుకు 25 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.1 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

గండికోటకు మహర్దశ : మంత్రి



విలేకరులతో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పక్కన ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, చైతన్యరెడ్డి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటకు మహర్దశ రానుందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సాయంత్రం గండికోటలోని అడ్వెంచర్ కోర్సు అకాడమీలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.165 కోట్ల విలువైన అయిదు పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అందులో భాగంగా గండికోటలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి శంకుస్థాపనలు చేస్తారన్నారు. దీంతో జిల్లా గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోట వారసత్వ సంపదకు మహర్దశ రానుందని తెలిపారు. టూరిజం ఎండీ ఆమ్రపాలితో కలిసి కోటలోని అన్ని ప్రాంతాలు, ఆలయాలు, గిడ్డంగి, మీనార్‌లు తదితరవన్నీ పరిశీలించామన్నారు. కేంద్ర ప్రభుత్వం శాస్కి స్కీం ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి శంకుస్థాపనలు చేస్తారన్నారు. ఇందులో వ్యూ పాయింట్, చారిత్రక వారసత్వ కట్టడాల అభివృద్ధికి రూ.28 కోట్లు, బోటింగ్ సదుపాయాలకు రూ.1.25 కోట్లు, పర్యాటకుల సందర్శన, ఇతర అభివృద్ధికి రూ.12.73 కోట్లు, సేవా కేంద్రాలకురూ.15.11 కోట్లు, టెంట్‌సిటీ అభివృద్ధికి రూ.5.05 కోట్లు, వనరుల పరిరక్షణకు రూ.2.62 కోట్లు, గార్జ్ వైభవానికి రూ.89 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలి పారు. అలాగే గండికోటలో 30 పాలీష్ టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గండికోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గండికోట పోర్ట్ అద్భుతమైన కట్టడమని, ఇందులో భాగంగా వివిధ కట్టడాలతో పాటు పురాతన రంగనాథస్వామి ఆలయం, జుమ్మామసీదును అనుసంధానించి పాత్‌వే ఏర్పాటు ద్వారా సందర్శకులకు సౌకర్యవంతంగా చేస్తామన్నారు. సహజసిద్ధంగా ప్రవహిస్తున్న నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మినీ థియేటర్, చిల్డ్రన్‌ఏరియా, ప్రకృతి సౌందర్యాలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే గండికోటలో అయిదు స్టార్‌హోటళ్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 8 నామినేషన్లు

కడప రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు రెండవ రోజు గురువారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఆరు వైసీపీ, ఒకటి జనసేన, ఒకటి ఇండిపెండెంట్‌గా వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి తుమ్మల హేమంత్‌రెడ్డి(వైసీపీ), తుమ్మల ఉమాదేవి(వైసీపీ) ఒక్కొక్కరు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి కోనేటి హరి వెంకటరమణ(జనసేన), వై.మధుమూర్తి(ఇండిపెండెంట్), ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైసీపీ), టక్కోలి శివారెడ్డి(వైసీపీ) నామినేషన్లు వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు వేసిన వారి వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ మంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ తదితరులు వచ్చారు.

నిబంధనల ఉల్లంఘన

ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) కార్యాలయంలోకి నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంది. అది కూడా ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత మరో అభ్యర్థి ఆర్వో కార్యాలయంలోకి రావాలి. అభ్యర్థుల తరుపున వచ్చిన నేతలు, నాయకులు, కార్యకర్తలు 100 మీటర్ల దూరం వెలుపలనే ఉండాలి. ఈ నిబంధనలను వైసీపీ నేతలు పాటించలేదు. అధికారులూ పట్టించుకోలేదు.

ఓవరాల్ చాంపియన్‌గా కడప క్లస్టర్ విద్యార్థులు

● ముగిసిన నవోదయ విద్యార్థుల యోగా పోటీలు



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కడప క్లస్టర్ విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన దక్షిణ భారత దేశ స్థాయి విద్యార్థుల యోగా పోటీలు గురువారం ముగిసాయి. కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. వివిధ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలలో కడప క్లస్టర్ నవోదయ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను, కృష్ణా క్లస్టర్ విద్యార్థులు రన్నర్స్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. వివిధ క్లస్టర్ల నుంచి నవోదయ జాతీయ యోగా పోటీలకు ఎంపికైన 21 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్నాడు జిల్లా డిఎంహెచ్‌వో డాక్టర్ బి రవి మాట్లాడుతూ యోగా ఇప్పుడు దేశ విదేశాలలో ఎంతో మందిని ఆకర్షిస్తున్నదని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాధనం యోగా అని చెప్పారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ యోగ పోటీలలో పాల్గొని నవోదయ జాతీయ క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు. కాగా ఆగస్టు 28, 29, 30 తేదీలలో నవోదయ విద్యార్థుల జాతీయ స్థాయి యోగా పోటీలు కూడా మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయాలోనే నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ నరసింహారావు తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి





మృతి చెందిన యువకుడు మణికంఠ

కడప క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో గురువారం రాత్రి వేగంగా వచ్చి ఆటో ఢీకొనడంతో మణికంఠ (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలి పారు. కమలాపురం మండలం పుట్లంపల్లె గ్రామానికి చెందిన మణికంఠ బుధవారం సొంత పని నిమిత్తం కడపకు వచ్చాడు. రాత్రి బైకులో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు. కాగా, మణికంట తల్లిదండ్రులు గంగాదర్, శైలజ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేతికి వచ్చిన కుమారుడి మృతితో బోరున విలపిస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

● తండ్రికి అప్పగించిన పోలీసులు

చాపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళుతున్నానని చెప్పి అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ తెలుసుకొని ఆమె తండ్రికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు... మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి చాపాడులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఈనెల 29న మంగళవారం అదృశ్యమైంది. ఆమె తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంకటమీనాక్షి తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి తీసుకువచ్చి తండ్రి శ్రీనివాసులుకు అప్పగించినట్లు తెలిపారు.

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని...



విద్యార్థిని చెంపపై పడిన వాతలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు చెయ్యి చేసుకున్న ఘటన చర్చనీ యాంశంగా మారింది. ముల్లా జుబేరియా అనే విద్యార్థిని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని పాఠశాలలో యూనిఫాం అందజేసిన తర్వాత నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాంవెనక్కు ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వక పోవడంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో ఉన్న విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. విద్యార్థి ఏడుపు విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ వచ్చి చూడగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో హెడ్మాస్టర్ శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లింది. హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు సబియాపై ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారించి ఆ ఉపాధ్యాయురాలిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో శోభారాణి తెలిపింది.

ఈశ్వరీదేవి మఠం ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందిస్తున్న కాణాల మల్లికార్జునరెడ్డి

బ్రహ్మంగారిమఠం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారిమఠం ఆలయ పునర్నిర్మాణం కోసం టీడీపీ మండల యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి రూ.10లక్షలు విరాళం అందజేశారు. బి.మఠం మండలం డి.అగ్రహారం గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆయన సతీమణి మాధవీరెడ్డిలు గురువారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, దేవస్థాన కార్యనిర్వాహక అధికారి బీవీ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో మఠాధిపతి వీరశివ కుమారస్వామికి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మల్లికార్జునరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



కడప ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వైరాలజీ ప్రొఫెసర్ జి.నరసింహ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్ర, ప్రొఫెసర్లు డి.విజయరాఘవ ప్రసాద్, ఎల్.వీరాంజనేయరెడ్డి, డి.విజయలక్ష్మిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ కార్యాలయ సూప రింటెండెంట్ కె.శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో లూటీ

● జేసీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో ప్రజలను లూటీ చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. జేసీ అధ్యక్షతన పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. గురువారం కడపలోని ద్వారకానగర్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూళ్లలో జరిగిన అక్రమాలపై జాయింట్ కలెక్టర్‌తో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే మాధవి కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారన్నారు. అక్రమార్కుల నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖ కూడా రాశారన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి జేసీ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించి నిజాలు నిగ్గు తేలుస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ విచారణలో అధికారులతో పాటు గత ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా తేలుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చిత్రావతి నదికి నీటి విడుదల

లింగాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి నదికి సీబీఆర్ (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి గురువారం పీబీసీ అధికారులు నీటిని విడుదల చేశారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా నదికి నీటిని విడుదల చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు రోజుల పాటు 125క్యూసెక్కుల మేర నీటిని నదికి విడుదల చేస్తామని పీబీసీ అధికారులు తెలిపారు.

పరిహారం కోసం ఎదురుచూపు


కూటమి ప్రభుత్వంపై ఆశలు

సీఎం ఆదుకోవాలని విజ్ఞప్తి

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గండికోట నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసింది. దీంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నారు. ఇదివరకే రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించి, నిర్వాసితులను కలిసి వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు. శుక్రవారం జమ్మలమడుగు పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు

రూ. 454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయ్యింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలుకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.



తాళ్లప్రొద్దుటూరు పునరావాస కాలనీలో డ్రైనేజీ లేక దుస్థితి

ఆటో డ్రైవర్‌పై దాడి

● డబ్బు, ఆటో లాక్కుని పరారీ


గాయపడిన ఆటో డ్రైవర్

పుల్లంపేట, జూలై 31: ఆటోను బాడుగకు మాట్లాడుకుని మార్గమధ్యంలో డ్రైవర్‌పై దాడి చేసి, అతని జేబులోని డబ్బుతోపాటు ఆటోను కూడా ఎత్తుకెళ్లిన సంఘటన పుల్లంపేట మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజంపేటలోని రాంనగర్‌కు చెందిన హనుమంతు ఆటో డ్రైవర్. పుల్లం పేట మండలం అనంతసముద్రం పంచాయతీకి చెందిన ఇద్దరు వ్యక్తులు గురువారం రాత్రి తమ గ్రామానికి వెళ్లేందుకు హనుమంతు ఆటోను బాడుగకు మాట్లాడుకున్నారు. అనంతసముద్రం వైపు వెళుతుండగా మార్గమధ్యంలో ఆటోను పక్కన ఆపమని చెప్పి, డ్రైవరును బెదిరించి అతనివద్ద ఉన్న ఆరు వేల రూపాయలు లాక్కున్నారు. అతనిని చితకబాది ఆటోతో సహా పరారయ్యారు. దీంతో ఆటో డ్రైవర్ పుల్లంపేట వరకూ నడుచుకుంటూ వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పెనగలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలకుంటలో నిర్మించిన శ్రీ రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు . గ్రామ పెద్దలు ముసలగారి రామచంద్రయ్య, యర్రంశెట్టి సుబ్బరాయుడు, ఎర్రజెన్ను లక్ష్మీనరసయ్య, గొబ్బూరు హరిరాయల్, లక్ష్మీనరసరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ మంత్రికి ఘన స్వాగతం

సిద్దవటం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటకశాఖ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌ను కడప ఎయిర్‌పోర్టులో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం కోట అభివృద్ధి విషయం ఆయనకు విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతి రాజ్ చాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ వాణిజ్య పార్లమెంట్ విభాగపు అధికార ప్రతినిధి ఎన్నారై చంద్ర, మన ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రవికుమార్, ఎ.చిన్నవెంకటయ్య తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన దళిత నాయకుడు

రైల్వేకోడూరు,జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం రైల్వేకోడూరు టీడీపీ దళిత నాయకుడు, సిద్ధవటం మండల టీడీపీ పరిశీలకుడు పుల్లెల రమేష్‌బాబు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో రోడ్లు, భవనాల దుస్థితిని మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.

రీ సర్వేతో భూసమస్యలకు పరిష్కారం

సిద్దవటం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని మండల సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. మాచుపల్లె, లింగంపల్లె, కొత్తపల్లె, జ్యోతి, టక్కోలి, వంతాటిపల్లె తదితర గ్రామాల్లో ఆగస్టు 5 తేదీలోగా సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సర్వేతో అన్యాక్రాంతమైన భూములు అసలైన రైతులకు దక్కుతాయని వివరించారు.

అన్నదానం

రామాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): పసుపులేటి రాజా మొదటి వర్ధంతి సందర్భంగా అతని తల్లి పసుపులేటి నాగమ్మ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం చేసినట్లు లయన్ పీ. శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి వాణి,శ్రీవర్ధన్, సుశాంత్, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

సారెప్పుడొస్తారో..?

● వచ్చినా సర్టిఫికెట్లు ఇస్తారో.. ఇవ్వరో.. ● రాయచోటి ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజల పడిగాపులు


అధికారికోసం వేచి ఉన్న ప్రజలు

రాయచోటిటౌన్, జూలై31(ఆంధ్రజ్యోతి): అది రాయచోటి రెవెన్యూ డివిజన్ కార్యాలయం. అక్కడ పనిచేసే ఓ అధికారి కోసం ప్రజలు పడిగాపులు కావాల్సిందే. ఆర్డీవో సైతం ఉదయం 10 గంటలకే విధులకు హాజరైనా ఆ అధికారి మాత్రం తనకు నచ్చిన సమయంలో కార్యాల యానికి వస్తాడు. ధ్రువీకరణ పత్రాలకోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలను ఒకటికి పదిసార్లు తిప్పుకుంటాడని అంటున్నారు. వారాల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగి, చివరికి తమకు కావలసిన సర్టిఫికెట్ మంజూరైందన్న ఆశతో వెళితే సంబంధిత వీఆర్‌వోను ఫోన్ చేయ మని చెప్పు అని చెబుతూ సర్టిఫికెటు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని పలువురు ఆరోపి స్తున్నారు. జూలై 26వ తేదీ దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు తాము దరఖాస్తు చేసిన విషయానికి సమాధానం ఇవ్వడం లేదని గురువారం కార్యాలయం వద్ద వేచివున్న పలువురు ఆరోపించారు. ఆర్డీవో 10 గంటలకు వస్తే ఆ అధికారి మాత్రం 11.30కు వచ్చి ఫోన్‌లో మాట్లాడుకుంటూ కిందికి పైకి తిరుగుతూ ఉంటాడని, తమగోడు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ మండలాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వస్తే ఆ అధికారి సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వకపోగా, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించేలా చూడాలని పలు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంఈవో-1 నియామకాల తీరు అసమంజసం

● అపస్ రాష్ట్ర కార్యదర్శి పోగుల వెంకట్రామిరెడ్డి


జాండ్రపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంఈవో-1 పోస్టుల్లో గవర్నమెంట్ మేనేజ్మెంట్‌లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులను నియమించడం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర కార్యదర్శి పోగుల వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ విషయంపై గురువారం వారు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఈవో-2 స్థానంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్లు పని చేస్తున్నారని, ఇప్పుడు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన గవర్నమెంట్ మేనేజ్మెంట్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో-1 స్థానంలో కూర్చోబెట్టడం తీవ్ర అన్యాయమని మంత్రికి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మండిపల్లి ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: జాండ్రపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆపస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఒంటిమిట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు రానుండడంతో గురువారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ ఎన్నికల అధికారి సుజాతమ్మ పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమాలపై అవగాహన

చిన్నమండెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ గురువారం చిన్నమండెం మండలం టీ. చాకిబండ, దిగువగొట్టివీడు గ్రామ సచివాలయాలను సందర్శించారు. పీ4 కార్య్ర కమంలో భాగంగా బంగారు కుటుంబాలు దత్తత తీసుకోవాల్సిన పేద కు టుంబాల జాబితాను పరిశీలించారు. ఆయా కుటుంబాల ఆర్థిక అభివృద్ధి పై, ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామ పెద్దలకు, సచివాలయ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ నెల 1న పింఛన్ పంపిణీ విధానంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పుల్లంపేట: అప్పయ్యరాజుపేట గ్రామ సచివాలయంలో పీ4పై సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో శిరీష గురువారం సూచనలు సలహాలు ఇచ్చారు. పంచాయతీలో 113 బంగారు కుటుంబాలు గుర్తించగా వాటికి సంబంధించి మార్గదర్శకులను గుర్తించి త్వరగా మ్యాప్ చేయాలన్నారు. ఈవోఆర్డీ ముత్యయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి పోతురాజు విగ్రహం సమర్పణ

పెనగలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి హరిజనవాడ గంగమ్మ దేవాలయానికి ఇదే గ్రామానికి చెందిన బొడ్డు పెంచలయ్య, లక్ష్మీదేవి దంపతులు రూ. లక్ష వ్యయంతో పోతులరాజు పంచలోహ విగ్రహాన్ని సమర్పించారు. బుధవారం రాత్రి ఓడేటివారిపల్లెకు చెందిన ఆసాది బృందం గంగాలమ్మ దేవాలయం ముందు ముగ్గులు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆసాది కథను వినిపించారు. తెల్లవారుజామున పోతులరాజు విగ్రహాన్ని దేవాలయంలో సమర్పించారు. గురువారం ఉదయం నుంచి బలిపోతులతో పాటు పోతురాజు విగ్రహాన్ని ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బోయనపల్లెలో గంగమ్మ జాతర

రాజంపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయనపల్లె హరిజనవాడలో గురువారం గంగమ్మ జాతరను నిర్వహించారు. నిర్వాహకులు పెద్దకాపు, గొల్లకాపు వారి నివాసాల వద్ద పోతుకు పూజలు, సాంగ్యాలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ ఆలయం వద్ద మొక్కుబడులు చెల్లించారు. శుక్రవారం నుంచి 9 రోజుల పాటు మాతమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కలిగి ఉండాలి

గాలివీడు/పుల్లంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాలివీడు బ్రాంచ్ మేనేజర్ శేషం ప్రకాశ్ , పుల్లంపేట ఏపీజీబీ మేనేజర్ ఆయా మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించి కార్య క్రమాల్లో తెలిపారు. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమంలో భాగంగా సామాజిక భద్రతా పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజే, బీవై, ఏపీవై వంటి పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలుగు ఏపీఎం పెద్దరెడ్డెయ్య, బ్యాంకు ఆఫీసర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

3న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడి రాక

రాయచోటి టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు జిల్లాకు రానున్నారని, ఆయన పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనునన్న సీఐటీయూ జాతీయ మహాసభల్లో చర్చించాల్సిన అంశాలను వివరిస్తారన్నారు. జిల్లాలోని అసంఘటిత కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కమ్ ప్రెసిడెంట్ కే. సుబ్రమణ్యంరాజు, ఎల్ఐసీ సంఘం ప్రెసిడెంట్ ఆదినారాయణరెడ్డి, కాయల విశ్వనాద్, కల్యాణ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

పుల్లంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సీతారాంపేట అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో శిరీషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ స్టాకు రిజిస్టర్, విద్యార్థుల హాజరు, అంగన్వాడీ కేంద్రం పరిసరాలను తనిఖీ చేశారు. మెనూ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ముత్తయ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో వాకర్స్ క్లీన్ అండ్ గ్రీన్

రాజంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హైస్కూల్, కళాశాల మైదానంలోని ముళ్ల పొదలను గురువారం కేఎంఎల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాహనాలు పార్కింగ్ చేసే ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. దీంతో క్రీడా కారులు, పాదచారులు, వాకింగ్‌కు వచ్చేవారు. కేఎంఎల్ ట్రస్ట్‌కు అభినందనలు తెలియజేశారు.

చెత్త రహిత రైల్వేకోడూరు లక్ష్యం

రైల్వేకోడూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): చెత్త రహిత రైల్వేకోడూరు తమ లక్ష్యమని రైల్వే కోడూరు పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రాజు తెలిపారు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని పద్మావతి పురంలో పని చేస్తున్న ఆయన బదిలీపై రైల్వేకోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ చెత్త రహిత రైల్వేకోడూరు తమ లక్ష్యమని తెలిపారు. రోడ్ల పైన చెత్తచెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పంచాయతీ వారికి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. చెత్త బండ్లు వచ్చినపుడు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేయాలన్నారు.

దక్షిణామూర్తికి పూజలు

రైల్వేకోడూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని శివాలయంలో ఉన్న దక్షిణామూర్తి కి గురువారం ఆలయ అర్చకుడు దూర్జటి యోగీశర్మ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివి

వీరబల్లి, జూలై31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని సానిపాయి పంచాయతీలో కృష్ణమయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన శ్రీనివాసులరెడ్డి, ఆయన సతీమణిని ఉపాధ్యాయులు, బంధువులు, మిత్రులు ఘనంగా శాలువాలతో పూలదండలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు తదితరలు పాల్గొన్నారు.

కనులపండువగా వరదరాజుస్వామి కల్యాణం

చిట్వేలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాతచిట్వేలిలోని వరదరాజుస్వామి ఆలయంలో గురువారం ఉదయం లక్ష్మీదేవిగోదాదేవి ఆంజనేయ, జయ విజయ, ధ్వజస్తంభ బలిపీఠాల ప్రతిష్ఠ, కళాన్యాసము, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, పెద్ద శాత్తుమోరు గోష్ఠి, నేత్రోన్మీలనము, జ్వాలా దర్శనం, ధేను దర్శనం, మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలు ఆలాపించారు మధ్యాహ్నం స్థానిక బ్రహ్మంగారి మఠం ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న దివ్యాంగులకు భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సభ్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ˜చేతికర్రలు, వాకర్లు, మూడుకాళ్ల చేతికర్రలు, నాలుగు కాళ్ల చేతికర్రలు, చంకకర్రలు, వీల్‌చైర్లు, తోపుడు బండ్లు, బ్యాటరీ సైకిల్, మూడు చక్రాల సైకిల్, కృత్రిమ అవయవాలను అందిస్తారని తెలిపారు. ఈ నెల 6 న లక్కిరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 6వ తేదీ అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న తాండా వాసులు

రాయచోటి కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కువినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పెద్దమండెం మండలం బండ్రేవు గ్రామ పరిధిలోని అవికే నాయక్ తాండాలో 35 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వీరి పూర్వీకుల పేరుతో సర్వే నెంబర్ 102, 103లో దాదాపు 50 ఎకరాల భూమి గత 90 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేరే తాండాకు సంబంధించిన గిరిజనులు అందులోని 20 ఎకరాల్లో పట్టాలు పొందారని, మిగిలిన 30 ఎకరాలు భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని ఇప్పటికే సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్‌నాయక్, తిరుపాల్‌నాయక్, నీలాభాయ్, కవిత, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె ఎంఈవోగా శివరామిరెడ్డి

ఓబులవారిపల్లె జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారి-1గా శివరామిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజంపేటలో పనిచేస్తున్న శివరామిరెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో విద్యాభివృద్ధి కి కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం


బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌తో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం బోరెడ్డిగారిపల్లెలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం చాకిబండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన టీడీపీ కార్యకర్త అనుమాల్లా కుటుంబాన్ని పరామర్శించి రూ.2 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. చిన్నమండెం టౌన్ ఉర్దూ స్కూల్ వీధిలో స్కీం బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయండి'

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 2న అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) జిల్లా అధ్యక్షుడు రాయచోటి రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర పిలుపునిచ్చారు. గురువారం వారు రాయచోటి పట్టణం లోని కొత్తపేటలోని బీటీఏ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. 12వ పీఆర్సీ ప్రకటించలేదని, 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలను ఇంతరకు విడుదల చేయలేదని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలలో ఒక్క డీఏ కూడా విడుదల చేయలేద న్నారు. ఇటీవల బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదని, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను కూడా రద్దు చేయాలని కోరుతూ జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులతో నాయకులు

ఓబులవారిపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని మంగంపేట ఆర్ ఆర్-5 లేఅవుట్‌లో రామాలయం నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, భార్య ముక్కా వరలక్ష్మి, కుమారుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ముందుగా వీరికి కూటమి నాయకులు, గ్రామస్థులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పూజలు చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

చిన్నమండెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ సంస్థల్లో తమకు అవసరమైన సమాచారాన్ని అభ్యర్థించవచ్చునని మండల వ్యవసాయ అధికారి గీత తెలిపారు. స్థానిక ఆర్బీకే లో మండల గురువారం సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసిన 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి సమాచారం అందిస్తామని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దళితవాడలో ట్యాంకర్లతో నీటి సరఫరా


నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్

రైల్వేకోడూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఇందిరానగర్ దళితవాడలో తాగునీటి మోటారు చెడిపోవడంతో అనంతరాజు పేట సర్పంచ్ కుశెట్టి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు బండారు మల్లికార్జున గురువారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. పంచాయతీలోని ప్రజలకు ఎక్కడ ఇబ్బంది వచ్చినా వెంటనే స్పందించి పనులు చేయిస్తున్నామని వారు తెలిపారు. మోటారు రిపేరు అయ్యేంత వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వారు వివరించారు.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

గాలివీడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ పాఠశాలలకు వచ్చే చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. గురువారం మండలంలోని నూలివీడు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల పౌష్టికాహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందజేయాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన పాఠశాల సమయాన్ని తు.చ తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థుల నమోదు, వారి హాజరు వంటి అంశాలను పరిశీలించారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు


పతకాలను సాధించిన రైల్వేకోడూరు విద్యార్థులు

రైల్వేకోడూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కుడికి, కటాస్ (తైక్వాండో) పోటీల్లో రైల్వేకోడూరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ ఎస్కే మౌలా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో విజయవాడ చెన్నపల్లె రామయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పదో జాతీయ స్థాయి కుడికి, కటాస్ పోటీల్లో ఎం. మంజుల, మదియా, శశాంక్, మోక్షిత్, మహబూబ్‌ఆహిల్, బాలాజీ, దీపక్, రోషన్ కుమార్‌రెడ్డి బంగారు పతకాలు, సంజీవ, సాత్విక్, ఎస్కే సారా, సుప్రియా వెండి పతకాలు , మనోజ్, ప్రణీత, సోహిత, లాస్య, విజ్ఞాన్, సామ్యూల్‌తేజ్, శ్రావ్య, జయశంకర్, యోగేంద్ర తదితరులు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ
ప్రతి ఒక్కరి బాధ్యత
జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం


డైట్ కేంద్రంలో మొక్క నాటుతున్న డీఈవో అధ్యాపకులు

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం అన్నారు. గురువారం ఉదయం డైట్ మైదానంలో 175 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మొక్కల పెంపకం అత్యవసరమని, దాని కోసం ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. భూతాపం తగ్గించడానికి ప్రపంచ వ్యాప్తంగా మొక్కలు పెంచాలన్నారు. ప్రాథమిక బాధ్యతలో భాగంగా మొక్కలకు కొంచెం స్థలం వదిలివేసి ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. రోడ్ల వెంబడి, పాఠశాలల్లో, బంజరు భూముల్లో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే తరాల ఆశలను, ఆకాంక్షలను, అవసరాలను తీర్చాలంటే మనం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిలాజ ఇంధనాల వాడకం తగ్గించి, వాటి స్థానంలో సౌరశక్తి బయోగ్యాస్ లాంటి ఇంధనాలను వాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు ఉషామాధురి, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కలీముల్లా, శివప్రసాద్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో గుంపుగా వెళ్లి కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో తనిఖీ చేసిన వైసీపీ నేతలపై గురువారం పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సోమవారం మధ్యాహ్నం సర్పంచ్ చెంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌తో కలిసి దాదాపు 8 మంది వైసీపీ, నేతలు ఎలాంటి అనుమతులు లేకుండా బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారన్నారు. అంతేకాక మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై హాస్టల్ ఉపాధ్యాయులు ఎవరని అడగగా తాము వైసీపీ రాష్ట్ర విద్యార్థి సెక్రటరీ అని తమను హాస్టళ్ల తనిఖీ చేపట్టమని జగన్ తెలపడంతో వచ్చామని చెప్పడంతో వారు అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. అనంతరం వైసీపీ నేతలు సోషల్ మీడియాలో హాస్టల్ తనిఖీపై పోస్టులు పెట్టారని తెలిపారు. దీనిపై అనుమతుల లేనిదే బయటి వ్యక్తులు హాస్టల్ వద్దకు రాకుండా రక్షణ కల్పించి వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

వివాదాస్పద భూమిలో సర్వే


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

కురబలకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ యూనివర్సిటీ పక్కన ఉన్న విలువైన వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్-220లో 69.42 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో ఆ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు 145 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం కొన్నేళ్ల పాటు ఈ భూమిలోకి ఎవరూ వెళ్లలేదు. అయితే వైసీపీ ప్రభుత్వంలో 145 సెక్షన్‌ను రద్దు చేయడంతో ఈ భూమిని ఆక్రమించుకోవడానికి పులివెందుల వాసులు ప్రయత్నించారు. దీంతో అప్పట్లో వివాదం నెలకొంది. అయితే ప్రభుత్వం మారడంతో వివాదం మళ్లీ మొదటకొచ్చింది. ఈ నేపథ్యంలో గత ఏడాది తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా భూహక్కుదారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతికి చెందిన చల్లా వెంకటేశ్వరు 3.15 సెంట్ల భూమికి హద్దులు చూపాలని దరఖాస్తు చేసుకోడంతో తహసీల్దార్ ధనంజయులు, సర్వేయర్ భువనేశ్వరి ఆ సర్వే నెంబర్ భూహక్కుదారులకు నోటీసులు అందజేసి సర్వే చేశారు. కాగా సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ భారీ బందోబస్తును నిర్వహించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న
ఎంఈవోలపై చర్యలు తీసుకోండి
డీఈవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కిచెన్ గార్డెన్ల నిర్వహణలో విధులు సక్రమంగా నిర్వహించని ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ్, ఏపీఎస్ జేఏసీ రాయలసీమ జిల్లాల కన్వీనర్ ఉత్తన్న డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేయడంతో పాటు, ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కిచెన్ గార్డెన్ల కోసం ప్రభుత్వం జిల్లాలో ఉన్న కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి, ఒక్కొక్క పాఠశాలకు రూ.5 వేలు మంజూరు చేసిందన్నారు. మంజూరు చేసిన నిధులను జిల్లా విద్యాశాఖ అధికారి మార్చి, ఏప్రిల్ నెలల్లో మండల విద్యాశాఖ అధికారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినా, ఆ నిధులను సంబంధిత వినియోగంలో మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. ముఖ్యంగా మదనపల్లె డివిజన్ పరిధిలోని కొన్ని పాఠశాలలు మాత్రమే నామమాత్రంగా సొంత నిధులతో గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. నిధులు జమ చేసిన పాఠశాలల్లో వాటిని ఏమాత్రం ఉపయోగించకుండానే ఉపయోగించినట్లుగా డీఈవోకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇచ్చారన్నారు. ఎంఈవోలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భగ్గుమన్న బొప్పాయి రైతు

- ప్రధాన దారిలో వరిగడ్డి కాల్చి లారీల అడ్డగింత
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- దళారుల ఇళ్లను ముట్టడించిన రైతులు
- రైతులపై పోలీసుల దురుసు ప్రవర్తన

రైల్వేకోడూరు/రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలను ఉన్నపళంగా తగ్గించడంతో గురువారం తెల్లవారుజామున రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను రైతులు అడ్డుకుని ప్రధాన దారిలో ఆందోళన చేశారు. దళారుల ఇళ్లను ముట్టడించారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె, కోడూరు ఎస్ఐలు మహేశ్, వీఎల్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ఆగ్రహించిన రైతులతో పోలీసులు చర్చలు జరిపారు. ఉన్నపళంగా దళారులు బొప్పాయి టన్ను రూ.7 వేలు తగ్గించారని, వరుసగా ధరలను తగ్గించుకుంటూ పోతున్నారని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులతో ఒకవైపు చర్చలు జరుగుతుండగానే చాలామంది రైతులు దళారుల ఇళ్ల వద్ద మళ్లీ ఆందోళన చేశారు. బొప్పాయి ధరలు పెంచినంత వరకు కాయలు కోసేది లేదని, లారీలను తోటల్లోకి రానివ్వమని తెగేసి చెప్పారు. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ప్రధానదారి పొడవునా రైతులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. చిట్వేలి రోడ్డులో గడ్డి కాల్చుతున్న ఓ రైతును పోలీసులు కొట్టారని, అలాగే సీఐ హేమసుందరరావు భూమా శివకేశవరెడ్డి అనే రైతుపై దురుసుగా ప్రవర్తించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రైతులకు అండగా ఉండాలనేగాని చేయి చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సీఐ మాట్లాడుతూ కావాలనే రైతులపై చేయి చేసుకోలేదని, రైతులు ఎక్కడ లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగిస్తారోనని కట్టడి చేయడానికి మాత్రమే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. దళారులు మోసాలు చేసి రైతులను నిలువునా నాశనం చేస్తున్నారని సబ్ కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బొప్పాయి సాగు చేస్తే దళారుల మాటలు విన్న మార్వాడీలు ధరలు తగ్గిస్తున్నారని రైతులు మండిపడ్డారు.

బొప్పాయికి ధరలు బాగా ఉన్నా రైల్వేకోడూరులో మాత్రం ధరలు తగ్గించి మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు రైతులను నచ్చచెప్పి రెవెన్యూ కార్యాలయం వద్దకు రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే రైతులతో మాట్లాడుతూ మీకు సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలే కానీ ఇలా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి విషయం తెలుసుకుని కోడూరు రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొప్పాయి రైతులకు అండగా ఉంటామని, ధరల పెరుగుదలకు కృషి చేస్తామన్నారు. సమావేశం లోనే కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్


రైల్వేకోడూరు ప్రధాన దారిలో వరి గడ్డిని కాల్చిన రైతులు

స్పందించి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కోడూరుకు వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తామని తెలిపారు. దీంతో రైతులు శాంతించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, డిప్యూటీ ఎన్నికల తహసీల్దార్ గల్లా రమణలు రైతుల సమస్యలపై నివేదిక సిద్ధం చేశారు. అయితే బొప్పాయి రైతుల ఆందోళన సందర్భంగా కొందరు వ్యక్తులు సందట్లో సడేమియా అంటూ మార్వాడీ ఇంటిలోకి ప్రవేశించి రూ.70 వేలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. కొందరు మార్వాడీలు, దళారులపై పలువురు దాడికి దిగినట్లు తెలిపారు.



రైల్వేకోడూరు ప్రధాన దారిలో ఆందోళన చేస్తున్న బొప్పాయి రైతులు


రైతును చేత్తో నెట్టివేస్తున్న సీఐ హేమసుందరరావు


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

ఉపాధి బిల్లుల బకాయి రూ. 2.14 కోట్లు

- 217 ఎకరాలతో ఉద్యాన పంటల సాగు
- 100 ఎకరాల్లో గడ్డి పెంపకం

పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులకు పీలేరు మండలంలో రూ.2.14 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా డబ్బులు కూలీల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఉపాధి బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉంది. ఉన్న బకాయిలలో కూలీలకు రూ.1,32,68,593 చెల్లించాల్సి ఉంది. అలాగే సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణంలో మెటీరియల్ కోసం రూ. 81,67,814 పెండింగ్ బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మెటీరియల్ బిల్లులు గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసిన వారు బిల్లులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు. పీలేరు మండలంలో ప్రస్తుతం 217 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు, 100 ఎకరాల్లో గడ్డి పెంపకం, పలు పంచాయతీల్లో సప్లయ్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఇవే కాకుండా మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయి.



ప్రతి ఒక్కరికీ పనులు



పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ స్థానికంగా ఉపాధి పనులు చూపిస్తున్నాము. ఏ ఒక్కరూ స్థానికంగా పనిలేదని అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఎంతమంది అయినా స్థానికంగానే ఉపాధి పనులు చేసుకోవచ్చు. చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్ చేశాము. వచ్చిన వెంటనే కూలీల అకౌంట్లలో జమ అవుతాయి.

అశోక్‌రెడ్డి, ఏపీవో, పీలేరు.

ఏఎస్ఐ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి : ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాసులు సేవలను పోలీసు యంత్రాంగం ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్ఐ శ్రీనివాసులుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్ఐ శ్రీనివాసులు అంకితభావంతో అహర్నిశలు సేవలందించారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే అవసరమైనప్పుడు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఆర్ఐ వీజే రామకృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసిరాం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేశ్, కె.రాజారెడ్డి, ఆర్ఎస్ఐ బి.అమర్‌నాథరెడ్డి, ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఏఎస్ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎస్పీ

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

ఒంటిమిట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ఎ.అర్జున్(66) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. ఇతను చిత్తూరు జిల్లా నారాయణవనం మండలం జీఎన్ కండ్రిగకు చెందిన వ్యక్తి. బుధవారం ఉదయం తిరుపతి నుంచి ఇంటర్‌సిటీ రైల్లో వచ్చి ఒంటిమిట్టలో దిగాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం పొంది తిరిగి రైల్వేస్టేషన్‌కు వెళుతూ మార్గమధ్యలోనే ఈద్గా వద్ద మృతి చెందాడు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న వ్యక్తులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఉన్న సెల్ నెంబరు ఆధారంగా పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

వృద్ధురాలి మృతి అనుమానాస్పదం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రాయచోటి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రింగురోడ్డు సమీపంలో వండాడి సరోజమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్న వండాడి చిన్నవెంకటప్ప భార్య సరోజమ్మ (70) మంగళవారం నుంచి కనిపించకుండాపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు.

ఈ క్రమంలో గున్నికుంట్ల రింగు రోడ్డు సమీపంలోని గుట్టపైన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని తెలియజేయడంతో సరోజమ్మ కుమారుడు వెంకట్రమణ అక్కడికి చేరుకుని తల్లిని గుర్తించాడు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆశలన్నీ బాబుపైనే

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా గండికోట
- మూడేళ్లలో స్టీలు ప్లాంటు నిర్మాణం
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి
- కొప్పర్తిలో పరిశ్రమలకు పర్యావరణ అనుమతుల అడ్డంకి
- మహానాడు హామీలు అమలు చేయాలి

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాలో అటు పర్యాటకం, ఇటు నీటిపారుదల రంగం పడకేశాయి. చంద్రబాబు కడప జిల్లాకు వ్యతిరేకి అంటూ జగన్ అండ్ కో దుష్ప్రచారం చేస్తుంటారు. ఆ ప్రచారాన్ని తిప్పికొట్టే సువర్ణ అవకాశం ఇప్పుడు చంద్రబాబు చేతుల్లో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీతో పాటు గ్రాండ్‌కెనాన్‌గా గుర్తింపు పొందిన గండికోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

స్టీలు ఫ్యాక్టరీ

జిల్లావాసుల చిరకాల వాంఛ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం. ఇప్పటికే ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారు. అయినా అడుగు ముందుకు పడని పరిస్థితి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన బ్రాహ్మణీ స్టీలు ప్లాంటు నిర్మాణం అటకెక్కింది. చంద్రబాబు 2018లో మైలవరం మండలంలో శంకుస్థాపన చేసినా అనంతరం ఆయన అధికారం కోల్పోవడంతో అదీ ఆగిపోయింది. జగన్ అధికారంలోకి వచ్చాక సున్నపురాళ్లపల్లె వద్ద రెండుసార్లు శంకుస్థాపన చేశారే కానీ స్టీలు ప్లాంట్ నిర్మాణం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మహానాడులో చంద్రబాబు చెప్పిన విధంగా సున్నపురాళ్లపల్లె వద్ద స్టీలు ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి వెయ్యిమందికి ఉపాధి కల్పించేలా పనులు ముమ్మరం చేయాల్సి ఉంది.

కడపలో తాగునీటి ఎద్దడి

కడప కార్పొరేషన్‌లో వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈసారి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పక్కా ప్రణాళికతో నగం డివిజన్లలో రోజూ నీళ్లు ఇచ్చేలా చేశారు. కడపలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడి నివారణ కోసం గత టీడీపీ హయాంలోనే రూ.75 కోట్లతో లింగంపల్లె వద్ద సర్ఫేజ్ చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అది నిలిచిపోయింది. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తమకు తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రైల్వేలైను

కడప నుంచి దూరంలో ఉన్న చెన్నై, హైదరాబాదు నగరాలకు రైలు ఉంది కానీ దగ్గరలో ఉన్న బెంగళూరుకు లేదు. కడప-బెంగళూరు రైల్వే లైను జిల్లావాసుల చిరకాల వాంఛ. జగన్ హయాంలో ఐదేళ్లు ఆ ప్రాజెక్టును అటకెక్కించారు.


ఇటీవల కేంద్రం దాదాపు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో చంద్రబాబు మార్కు చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి నత్తనడకన సాగుతోంది. మహానాడు సందర్భంగా జీఎన్ఎస్‌కు రూ.1000 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ పూర్తి చేసి త్వరగా నిర్మాణం చేపట్టాలి. ఇక జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు సాగడంలేదు. సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లకు సంబంధించి పెండింగు పనులు ఉన్నాయి. బ్రహ్మంసాగర్ లీకేజీ అలాగే ఉంది. వీటిన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సి ఉంది.

గండికోట



గండికోటలో సహజ సిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయ, ఇక్కడున్న అద్భుతమైన కట్టడాలు గొప్ప వారసత్వ సంపద. గండికోట వైభవం అందరికీ తెలిసేలా 2014-2019లో సీఎం చంద్రాబు నాయుడు ప్రభుత్వం ఇక్కడ ఉత్సవాలు నిర్వహించింది. సొంత జిల్లా వాసి జగన్ సీఎం అయిన తరువాత గండికోట అభివృద్ధిని గాలికి వదిలేశారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో గండికోటకు ప్రాధాన్యం లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రూ.165 కోట్ల విలువైన అభివృద్ధి పనులను శుక్రవారం సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొప్పర్తి

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో ఓ బ్లాక్‌ను కేంద్రం నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఇప్పటికే కొన్ని పరిశ్రమలున్నాయి. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు అడ్డంకిగా ఉందని చెబుతున్నారు. కేంద్రంలోనూ ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో పర్యావరణ అనుమతులు తెచ్చుకుంటే పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.



ఇక ఆటో మ్యుటేషన్

- రిజిస్ట్రేషన్ అయినరోజే మ్యుటేషన్ పూర్తి
- నేటి నుంచి కార్పొరేషన్ పరిధిలో అమలు

కడప కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏవైనా స్థిరాస్థులకు రిజిస్ట్రేషన్లు జరిగితే పేర్ల మార్పునకు మ్యుటేషన్ చేసుకోవాలంటే రెవెన్యూ, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. వాళ్ల డిమాండ్ మేరకు సమర్పించుకుంటే సరి. లేదంటే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిందే. ప్రజలకు ఈ ఇబ్బందులు లేకుండా చేసేందుకు కూటమి సర్కారు ఆస్థి యాజమాన్య బదిలీని సులభతరం చేసింది. దీంతో ఇన్నాళ్లు సాగిన అవినీతి వ్యవహారాలకు చెక్ పడనుంది. రాష్ట్రంలో 17 కార్పొరేషన్ల పరిధిలో ఆటో మ్యుటేషన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కడప కార్పొరేషన్‌లో 1వ తేదీ శుక్రవారం నుంచి ఆటో మ్యుటేషన్ అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

గతంలో మ్యుటేషన్ అంటే కాసుల పండగే

కొనుగోలు చేసిన స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ వారి పేరు మార్పు (మ్యుటేషన్) చేసుకోవాలంటే కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు రకరకాల కొర్రీలు వేస్తూ చుక్కలు చూపించేవారు. ఇంటి పన్నులు, కుళాయి రశీదుల్లో పేరు మార్పు కోసం ఆస్తుల మార్కెట్ వాల్యూలో 1శాతం మ్యుటేషన్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాలి. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయంలో డాక్యుమెంట్లు పరిశీలించిన అనంతరం ఆర్ఐ, ఆర్వో లాగిన్‌ల నుంచి కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. ఇక్కడ నుంచే అవినీతి సిబ్బంది ఆటలు మొదలవుతాయి. నిబంధనల మేరకు 14 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. కానీ దళారులను రంగంలోకి దింపి తాము కోరిన ముడుపులు ఇచ్చేదాకా నెలల తరబడి సాగదీస్తూ వచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు మ్యుటేషన్లలో అవినీతికి చెక్ పెడుతూ ఏ రోజైతే ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేసుకుంటారో అదే రోజున కొనుగోలుదారుల పేరుతో ఆటో మ్యుటేషన్ జరిగేలా తీసుకున్న నిర్ణయంతో స్థిరాస్థిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరోజులోనే ఆటో మ్యుటేషన్



కార్పొరేషన్ పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగిన రోజే ఆస్తి యాజమాన్య బదిలీకి సంబంధించి ఆటో మ్యుటేషన్ పూర్తి అవుతుంది. దాన విక్రయ, పరివర్తన దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్థి పూర్తి స్థాయిలో బదలాయింపు జరుగుతుంది. స్థిరాస్థిదారులకు సంబంధించిన ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక సీడీఎంఏ డేటాను రూపొందించింది. దీంతో భవిష్యత్తులో ఆస్థి వివాదాలు తగ్గుతాయి. పాత డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్లకు పూర్తి బ్రేక్ పడనుంది.

- పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

సీడీఎంఏ డేటాలో ఆస్థి వివరాలు నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ పరిధిలో ఆస్థుల రిజిస్ట్రేషన్లు, ఆటో మ్యుటేషన్ విధానంలో పారదర్శకత పాటించనుంది. ఒక ఆస్థి కొనుగోలు తరువాత యాజమాన్య బదలాయింపు వివరాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డేటా బేస్‌లో భద్రపరచనుంది. గతంలో 40-50 ఏళ్లనాటి ఇళ్లకున్న పాత డోర్ నెంబర్లపై అక్రమ ఆస్థుల రిజిస్ట్రేషన్లు సాగేవి. ఇవి కోర్టు వివాదాలకు దారి తీసేవి. ఆటోమ్యుటేషన్ ద్వారా ఇప్పుడు అలాంటి డోర్ నెంబర్లను ఆన్‌లైన్ సిస్టం గుర్తించదు. దీంతో పాత కాలం నాటి మనుగడలేని డోర్‌నెంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్ పడనుంది. ఇక ఆటో మ్యుటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఆస్థి విలువను బట్టి ఆన్‌లైన్ సిస్టం ద్వారా లెక్కించిన ఫీజును వసూలు చేయనుంది. ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లను, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారునికి ఎప్పటి కప్పుడు వివరాలు తెలుసుకునే విధంగా (సీడీఎంఏ) ఏపీ ఇంటి గ్రేటెడ్ కచ్చితమైన ఆస్థి డేటాను అందించేలా రూపొందించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



లోకేష్ (కడప)

కడప స్పోర్ట్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆటకు చివరి రోజైన గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.1 ఓవర్లలో 186 పరుగుల కు ఆలౌట్ కాగా, కడప జట్టు 53.3 ఓవర్లలో 158 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి మూడో రోజు బ్యాటింగ్‌కు దిగి 84.4 ఓవర్లలో 325 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ జట్టులోని ఆదినారాయణరెడ్డి 156 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 67.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. ఇందులో లోకేష్ 85 పరుగులు చేశారు. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలి సిందే. అనంతరం కర్నూలు జట్టు 100 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసిది. దీంతో చిత్తూరు జట్టుకు 25 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.1 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

గండికోటకు మహర్దశ : మంత్రి



విలేకరులతో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పక్కన ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, చైతన్యరెడ్డి

జమ్మలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటకు మహర్దశ రానుందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సాయంత్రం గండికోటలోని అడ్వెంచర్ కోర్సు అకాడమీలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.165 కోట్ల విలువైన అయిదు పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అందులో భాగంగా గండికోటలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి శంకుస్థాపనలు చేస్తారన్నారు. దీంతో జిల్లా గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోట వారసత్వ సంపదకు మహర్దశ రానుందని తెలిపారు. టూరిజం ఎండీ ఆమ్రపాలితో కలిసి కోటలోని అన్ని ప్రాంతాలు, ఆలయాలు, గిడ్డంగి, మీనార్‌లు తదితరవన్నీ పరిశీలించామన్నారు. కేంద్ర ప్రభుత్వం శాస్కి స్కీం ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి శంకుస్థాపనలు చేస్తారన్నారు. ఇందులో వ్యూ పాయింట్, చారిత్రక వారసత్వ కట్టడాల అభివృద్ధికి రూ.28 కోట్లు, బోటింగ్ సదుపాయాలకు రూ.1.25 కోట్లు, పర్యాటకుల సందర్శన, ఇతర అభివృద్ధికి రూ.12.73 కోట్లు, సేవా కేంద్రాలకురూ.15.11 కోట్లు, టెంట్‌సిటీ అభివృద్ధికి రూ.5.05 కోట్లు, వనరుల పరిరక్షణకు రూ.2.62 కోట్లు, గార్డ్ వైభవానికి రూ.89 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలి పారు. అలాగే గండికోటలో 30 పాలిష్ టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గండికోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గండికోట పోర్ట్ అద్భుతమైన కట్టడమని, ఇందులో భాగంగా వివిధ కట్టడాలతో పాటు పురాతన రంగనాథస్వామి ఆలయం, జుమ్మామసీదును అనుసంధానించి పాత్‌వే ఏర్పాటు ద్వారా సందర్శకులకు సౌకర్యవంతంగా చేస్తామన్నారు. సహజసిద్ధంగా ప్రవహిస్తున్న నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మినీ థియేటర్, చిల్డ్రన్‌ఏరియా, ప్రకృతి సౌందర్యాలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే గండికోటలో అయిదు స్టార్‌హోటళ్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 8 నామినేషన్లు

కడప రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు రెండవ రోజు గురువారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఆరు వైసీపీ, ఒకటి జనసేన, ఒకటి ఇండిపెంటెంట్‌గా వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి తుమ్మల హేమంత్‌రెడ్డి(వైసీపీ), తుమ్మల ఉమాదేవి(వైసీపీ) ఒక్కొక్కరు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి కోనేటి హరి వెంకటరమణ(జనసేన), వై.మధుమూర్తి(ఇండిపెండెంట్), ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైసీపీ), టక్కోలి శివారెడ్డి(వైసీపీ) నామినేషన్లు వేశారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు వేసిన వారి వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ మంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ తదితరులు వచ్చారు.

నిబంధనల ఉల్లంఘన

ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) కార్యాలయంలోకి నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంది. అది కూడా ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత మరో అభ్యర్థి ఆర్వో కార్యాలయంలోకి రావాలి. అభ్యర్థుల తరుపున వచ్చిన నేతలు, నాయకులు, కార్యకర్తలు 100 మీటర్ల దూరం వెలుపలనే ఉండాలి. ఈ నిబంధనలను వైసీపీ నేతలు పాటించలేదు. అధికారులూ పట్టించుకోలేదు.

ఓవరాల్ చాంపియన్‌గా కడప క్లస్టర్ విద్యార్థులు

- ముగిసిన నవోదయ విద్యార్థుల యోగా పోటీలు



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కడప క్లస్టర్ విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన దక్షిణ భారత దేశ స్థాయి విద్యార్థుల యోగా పోటీలు గురువారం ముగిసాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. వివిధ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలలో కడప క్లస్టర్ నవోదయ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను, కృష్ణా క్లస్టర్ విద్యార్థులు రన్నర్స్ చాంపియన్ షిప్‌ను సాధించారు. వివిధ క్లస్టర్ల నుంచి నవోదయ జాతీయ యోగా పోటీలకు ఎంపికైన 21 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ యోగా ఇప్పుడు దేశ విదేశాలలో ఎంతో మందిని ఆకర్షిస్తున్నదని అన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ యోగ పోటీలలో పాల్గొని నవోదయ జాతీయ క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు.

బ్రౌన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కడప నాగరాజుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సముద్ధారకుడు, తెలుగు సూర్యుడిగా పిలువబడే చార్లెస్ బ్రౌన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయాలని కడప బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈవిషయంపై పలుమార్లు లేఖలు కూడా రాశామన్నారు. రాష్ట్రపర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కడప జిల్లా నోడల్ అధికారి సౌరభ్‌గౌర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించి తప్పకుండా బ్రౌన్ జయంతిని ప్రభుత్వం నిర్వహించేలా ప్రయత్నిస్తామని తెలిపారని, ఆరునెలలుగా దీనికి సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి పేషీలో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడును కోరారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి





మృతి చెందిన యువకుడు మణికంఠ

కడప క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో గురువారం రాత్రి వేగంగా వచ్చి ఆటో ఢీకొనడంతో మణికంఠ (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలి పారు. కమలాపురం మండలం పుట్లంపల్లె గ్రామానికి చెందిన మణికంఠ బుధవారం సొంత పని నిమిత్తం కడపకు వచ్చాడు. రాత్రి బైకులో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు. కాగా, మణికంట తల్లిదండ్రులు గంగాదర్, శైలజ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేతికి వచ్చిన కుమారుడి మృతితో బోరున విలపిస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

- తండ్రికి అప్పగించిన పోలీసులు

చాపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళుతున్నానని చెప్పి అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ తెలుసుకొని ఆమె తండ్రికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు... మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి చాపాడులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఈనెల 29న మంగళవారం అదృశ్యమైంది. ఆమె తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంకటమీనాక్షి తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి తీసుకువచ్చి తండ్రి శ్రీనివాసులుకు అప్పగించినట్లు తెలిపారు.

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని...



విద్యార్థిని చెంపపై పడిన వాతలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు చెయ్యి చేసుకున్న ఘటన చర్చనీ యాంశంగా మారింది. ముల్లా జుబేరియా అనే విద్యార్థిని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని పాఠశాలలో యూనిఫాం అందజేసిన తర్వాత నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాంవెనక్కు ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో ఉన్న విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. విద్యార్థి ఏడుపు విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ వచ్చి చూడగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో హెడ్మాస్టర్ శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లింది. హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు సబియాపై ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారించి ఆ ఉపాధ్యాయురాలిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో శోభారాణి తెలిపింది.

ఈశ్వరీదేవి మఠం ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందిస్తున్న కాణాల మల్లికార్జునరెడ్డి

బ్రహ్మంగారిమఠం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారిమఠం ఆలయ పునర్నిర్మాణం కోసం టీడీపీ మండల యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి రూ.10లక్షలు విరాళం అందజేశారు. బి.మఠం మండలం డి.అగ్రహారం గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆయన సతీమణి మాధవీరెడ్డిలు గురువారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, దేవస్థాన కార్యనిర్వాహక అధికారి బీవీ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో మఠాధిపతి వీరశివ కుమారస్వామికి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మల్లికార్జునరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



కడప ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వైరాలజీ ప్రొఫెసర్ జి.నరసింహ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్ర, ప్రొఫెసర్లు డి.విజయరాఘవ ప్రసాద్, ఎల్.వీరాంజనేయరెడ్డి, డి.విజయలక్ష్మిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ కార్యాలయ సూప రింటెండెంట్ కె.శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో లూటీ

- జేసీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చెత్త పన్ను పేరుతో ప్రజలను లూటీ చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. జేసీ అధ్యక్షతన పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. గురువారం కడపలోని ద్వారకానగర్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూళ్లలో జరిగిన అక్రమాలపై జాయింట్ కలెక్టర్‌తో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే మాధవి కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారన్నారు. అక్రమార్కుల నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖ కూడా రాశారన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి జేసీ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించి నిజాలు నిగ్గు తేలుస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ విచారణలో అధికారులతో పాటు గత ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా తేలుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చిత్రావతి నదికి నీటి విడుదల

లింగాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి నదికి సీబీఆర్ (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి గురువారం పీబీసీ అధికారులు నీటిని విడుదల చేశారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా నదికి నీటిని విడుదల చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు రోజుల పాటు 125క్యూసెక్కుల మేర నీటిని నదికి విడుదల చేస్తామని పీబీసీ అధికారులు తెలిపారు.

పరిహారం కోసం ఎదురుచూపు

- కూటమి ప్రభుత్వంపై ఆశలు
- సీఎం ఆదుకోవాలని విజ్ఞప్తి



తాళ్లప్రొద్దుటూరు పునరావాస కాలనీలో డ్రైనేజీ లేక దుస్థితి

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గండికోట నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసింది. దీంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెంచుకున్నారు. ఇదివరకే రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించి, నిర్వాసితులను కలిసి వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు. శుక్రవారం జమ్మలమడుగు పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు

రూ. 454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయ్యింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలుకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

విజయవాడలో హజ్ ఎంబార్కేషన్ కేంద్రం

హజ్‌కమిటీ రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన పఠాన్ ఖాదర్‌ఖాన్



హజ్‌కమిటీ చైర్మన్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని హజ్ యాత్రికుల సౌలభ్యం కోసం విజయవాడలో కొత్తగా హజ్ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ పేర్కొన్నారు. ప్రభుత్వం వినతిపై కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రి ఎన్.ఎండి.ఫరూక్, మైనార్టీ రాష్ట్ర వ్యవహారాల ప్రత్యేక సలహాదారుడు ఎం.ఎస్.షరీఫ్, హజ్‌కమిటీ చైర్మన్ హాజీ హసన్‌బాషా కేంద్రమంత్రులు కిరణ్‌రిజిజూ (మైనార్టీస్), కె.రామ్మోహన్ నాయుడు(సివిల్ ఏవియేషన్) దృష్టికి తీసుకెళ్లగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. హజ్‌యాత్రకు వెళ్లే వారు గతంలో హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చేదని, 2026నుంచి విజయవాడ కేంద్రంగా వెళ్లే అవకాశం ఏర్పడిందన్నారు. పఠాన్ ఖాదర్‌ఖాన్ గురువారం విజయవాడకు వెళ్లి హజ్‌కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు హాజీ హసన్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గడువులోగా సమాచారం ఇవ్వాలి : ఎంపీడీఓ

కురబలకోట, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుడికి నిర్ణీత గడువులోగా సమాచారం తప్పనిసరిగా అందివ్వాలని ఎంపీడీఓ గంగయ్య సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులకు సమాచార చట్టంపై అవగాహన కల్పిస్తూ మండల పరిధిలో ఏదైన సమాచారం కోసం దరఖాస్తు దారుడు చేసుకున్న నేపథ్యంలో తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందివ్వాలన్నారు. లేని పక్షంలో దరఖాస్తు దారుడు అప్పీల్ కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అందివ్వాలని కోరారు.

'సమాచార హక్కు'పై అవగాహన అవసరం

నిమ్మనపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగివుండాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమాచారాన్ని అయినా అధికారులు నుంచి రాబట్టవచ్చున్నారు. సమాచారం అడిగిన 30రోజుల్లో సమాచారం ఇవ్వాలని వుంటుందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పౌరులు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కు కలిగి వుంటారని తెలిపారు. కార్యదర్శులు ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. సర్వేయర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి

మదనపల్లె అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4వ తేదీన చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క వాల్మీకి కులబాంధవుడూ హాజరవాలన్నారు. ఇప్పటి వరకు అన్ని ప్రభుత్వాలు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నించినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఎస్టీ రిజర్వేషన్ లేక వాల్మీకి బిడ్డలు ఇబ్బందులు పడుతున్నారని, 50 ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీలో చేర్చకుండా మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుబ్రహ్మణ్యం కమిటీ వేసి ఎస్టీలో చేరుస్తామని చెప్పి మాయ చేసిందని, వైసీపీ ప్రభుత్వం, అనంతరం టీడీపీ ప్రభుత్వం హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే ఎస్టీ జాబితాలో చేరుస్తామని చెప్పి ఏడాది గడిచినా దాని ఊసేలేదన్నారు. కార్యక్రమంలో కోశాధికారి విజయ్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మధు, కమలాకర్, పసుపులేటి సూరి, మేకల భరత్, మేకల గుర్రప్ప, శంకర, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ ఆయుధం లాంటిది



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ

కలకడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆపదలో వున్నవారికి శక్తి యాప్ ఆయుధం వంటిదని పోలీసు శక్తి టీం సిబ్బంది దశరథ, కల్పన అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ సైబర్ రమోసగాళ్ల వలలో చిక్కకుండా విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జీవితాలను ఛిన్నాభిన్నం చేసే డ్రగ్స్, గంజాయి అలవాట్లకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. బాలికలకు పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 122 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ క్రిష్ణవేణి

బి.కొత్తకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య కళాశాల వేదికగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందిన లభించింది. ఉద్యోగ వేటలో ఉన్న 284 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు వీరితో ముఖాముఖి మాట్లాడి 112 మందిని వారి అర్హతలను బట్టి వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యల్.ప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ క్రిష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. ఎంపికైన యువతను అభినందించారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్, కోఆర్డినేటర్ రేవతి, ప్రిన్సిపాల్ ప్రసా ద్, వైస్‌ప్రిన్సిపాల్ రాజేంద్రనాయక్, ఎంఈఓ రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

పెద్దమండ్యం, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని పెద్దమండ్యం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మోడల్‌స్కూల్ లో విద్యార్థులకు పలు అంశాలపై ఎస్‌ఐ వివరిస్తూ విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కాలేజీ, పాఠశాలల్లో మత్తు పదార్థాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రామాంజునాయక్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజమార్గం రూపుదిద్దుకునేనా.. !

జిల్లా రోడ్లకు మహర్దశ ఎప్పుడో...? ● సింగిల్ తారురోడ్లల్లో కష్టంగా ప్రయాణాలు

● డబుల్ రోడ్డు కోసం ఎదురు చూస్తున్న తంబళ్లపల్లి ప్రజలు



పెద్దమండ్యం- చిన్నమండ్యం సింగిల్ రోడ్డు

పెద్దమండ్యం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన నియోజకవర్గాల్లో తంబళ్లపల్లి ఒకటి. ఈ నియోజకవర్గంలో డబుల్ రోడ్లు ఏర్పాటు చేస్తే అభివృద్ధి సాధించినట్లే. రాయచోటి జిల్లా ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం హడివుడి చేసేందే కానీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయింది. అంతేకాకుండా నియోజక వర్గంలో సింగిల్ తారురోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రజలు ఏచిన్న పనికోసం జిల్లా కేంద్రం రాయచోటికి వెళ్లాలన్నా కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లి, పెద్దమండ్యం, చిన్నమండ్యం మీదుగా వెళ్లాలి. అయితే ఈ మార్గంలో కాలం చెల్లిన సింగిల్ రోడ్ల రూపును మార్చలేక పోయింది వైసీపీ ప్రభు త్వం. అయితే సింగిల్ రోడ్లు అత్యవసర పనుల కోసం వెళుతున్న ప్రజల ప్రాణాలను సైతం మిం గేస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

రాయచోటి అన్నమ్మయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజక వర్గంలోని కాలం చెల్లిన సింగిల్ తారు రోడ్లకు మహర్దశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం జిల్లా ఏర్పాటుకు హడావుడి చేసినా మౌలిక సదుపాయాల కల్పనలోనే విఫలమైంది. ప్రధానంగా నియోజక వర్గంలో సింగిల్ తారురోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని బికొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లి, పెద్దమండ్యం, మండల వాసులు చిన్నమండ్యం మీదుగా జిల్లా కేంద్రం రాయచోటికి వెళుతుంటారు. మండల అధికారులు, అన్ని వర్గాల పార్టీ నేతలు, ప్రజలు పలు అవసరాల నిమిత్తం రాయచోటికి వెళ్లేందుకు ఈ సింగిల్ రోడ్డే గతి. అధ్వాన్నస్థితికి చేరుకున్న ఈరోడ్లలో ఎదురుఎదురుగా వాహనాలు వస్తూ వైతొలుగుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఖరీదైన వాహనాలు వెళ్లలేని స్థితి నెలకొంది. తరుచూ రోడ్డు ప్రమాదాలతో పదుల సంఖ్యల్లో వాహనదారులు మృత్యువాత పడు తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో రాయచోటికి వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. పీటీఎం, బి.కొత్తకోట, తంబళ్లపల్లి, ములకలచెరువు అధికారులు, ప్రజలు అంగళ్లు, గుర్రంకొండ, చిన్నమండ్యం మీదుగా రాయచోటికి వెళుతున్నారు. ఇలా జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 140 కిలోమీటర్లు దూరాన్ని బస్సుల్లో ప్రయాణం చేయాలి. ఇందుకు సుమారు 3 గంటలు సమయం పడుతుంది. నియోజకవర్గంలోని సింగిల్ తారురోడ్లను డబుల్ తారురోడ్లగా అభివృద్ధి పరిస్తే రెండు గంటల్లో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చని కొత్తకోట, పీటీఎం ప్రజలు వివరిస్తున్నారు. గతంలో కడప-బెంగుళూరు డబుల్ రోడ్ల అభివృద్ధి పనులకు అధికారులు సర్వే కూడా చేశారు. కానీ ఆ పనులు రూపుదాల్చలేదు. జిల్లా రోడ్లు అభివృద్ధి పనుల్లో భాగంగా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని సింగల్ రోడ్లను డబల్ రోడ్లు అభివృద్ధి పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కోరారు.



అధ్వాన్నంగా ఉన్న పెద్దమండ్యం- తంబళ్లపల్లి సింగిల్ తారురోడ్డు



దుస్థితిలో పెద్దమండ్యం -గాలివీడు రోడ్డు

మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీదే విజయం



ఎమ్మెల్యే షాజహాన్‌బాషతో టీడీపీలో చేరిన వెంకటనరసింహ

మదనపల్లె టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో టీడీపీ సుపరిపాలనతో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. గురువారం 33వ వార్డులో బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించా రు. నీరుగట్టువారిపల్లెలో బీసీ నేతల మద్దతు ఎల్లపుడూ టీడీపీకే వుంటుందన్నారు. మదనపల్లె బెంగళూరు బస్టాండు వద్ద సమస్యలపై దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నామని, దీనిపై వైసీపీ నేత లు ఇష్టమెచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి వైసీపీ హయాంలో 10శాతం కూడా జరగలేదని, ఏ వేదికపై నుంచి అయినా వైసీపీ నేతలకు చాలెంజ్ చేస్తున్నానన్నారు. టీడీపీ నేతలు సిద్ధప్ప, నీలకంఠ, శ్రీరాములు, కమలమరి కృష్ణ, రామచంద్ర, సుద్దిళ్ల సుధాకర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీలో 40 మంది చేరిక

మున్సిపల్ ఒకటో వార్డులో 40 మంది యువత ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి రఘుపతినాయుడు ఆధ్వర్యంలో గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసిన ఇంటిపెండెంట్ అభ్యర్థి వెంకట నరసింహ సహా 40 మంది టీడీ పీలో చేరారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, నాగ, వెంకటరమణ, బంకు రమణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

దేవళచెరువులో....

ములకలచెరువు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. దేవళచెరువులో సుపరి పాలన తొలి అగుడులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నేతలు శివారెడ్డి, బేరి శ్రీనివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామదాసు, కృష్ణప్ప, రామాంజులు, ఉత్తమనాయుడు, శివన్న, మోహన పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపమని డిప్యూటీ సీఈఓ వెంకట నారాయణ ఆదేశించారు. ఇటీవల పట్టణాన్ని సందర్శించిన ఆయన ఆదేశాలతో ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. 60 వేలు పైచిలుకు జనాభా నివసిస్తున్న పట్టణానికి రోజూ విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణీకులు, రైతులు వేలాది మంది రోజువారి కార్యక్రమాలపై వచ్చి వెళుతుంటారు. అత్యవసర సమయాల్లో అవసరం మేరకు పట్టణంలో ఎక్కడా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, జడ్జిక్వాటర్స్ ఏరియా, మార్కెట్ యార్డ్, చిల్డ్రన్స్ పార్క్, వారపు సంత, తిరుపతి రోడ్డులో మరుగు దొడ్ల నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీలైనంత త్వరలోనే టాయిలెట్లు నిర్మిస్తామని ఇన్‌చార్జి ఈఓ తెలిపారు.

బ్యాంకుల్లో చోరీ జరగకుండా జాగ్రత్త పడాలి



సీసీ కేమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

తంబళ్లపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి బ్యాంకు మేనేజర్లకు సూచించారు. గురువారం ఎస్‌బీఐ వద్ద భద్రత, పరిసరాలు, సీసీ కేమెరాలను ఎస్‌ఐ పరిశీలించారు. కెమెరాల్లో రికార్డు అయ్యే దృశ్యాలు స్పష్టంగా కనపడేలా బ్యాంకుల వద్ద అత్యాధునిక కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, ఏటీఎంలు, లాబీలు, పరిసరాలు అన్నింటినీ కవర్ చేసేలా సీసీ టీవీ కేమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకుల వద్ద ఖచ్చితంగా సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలని సూచించారు. ఖాతాదారుల లావాదేవీలను గమనిస్తూ, ఓటీపీల గురించి హెచ్చరిస్తూ ఉండాలన్నారు. బ్యాంకుల్లో అపరిచిత వ్యక్తులను గమనించినపుడు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియచేయాలని సూచించారు. ఆయన వెంట బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది ఉన్నారు.

బాధ్యతగా పని చేయండి



వెలిగల్లులో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీధర్‌రావు

పెద్దమండ్యం, జూలై 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. వెలిగల్లు సచివాలయ సిబ్బందితో గురువారం సమమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య, చెత్త సేకరణ పనులు చేపట్టాలన్నారు. రోజువారీ తాగునీటి సరఫరాలపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్ అభివృద్ధి పనుల వివరాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన బంగారు కుటుంబాల ఎంపిక కట్టుదిట్టంగా చేయాలన్నారు. కార్యదర్శి ఖాదర్‌బాష, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1568 బంగారు కుటుంబాల గుర్తింపు

పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలంలో పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) గ్రామ సభలు నిర్వహించి 1568 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పీ-4'ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిందని తెలిపారు. మండలంలోని సచివాలయాల పరిధిలో సభలు నిర్వహించి నిరుపేద కుటుంబాలను గుర్తించామన్నారు. గర్నిమిట్ట 120, గ్యారంపల్లె 104, జిల్లేలుమంద 528, కంభంవారిపల్లె-1 72, కంభంవారిపల్లె-2 82, పద్దిపట్లవారిపల్లె 131, మారేళ 13, నూతనకాలువ 45, సొరకాయలపేట 128, తీతవగుంటపల్లె 64, తిమ్మాపురం 145, తువ్వపల్లె 86, వగళ్ల 50. ఇందులో ఇప్పటి వరకూ 683 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

పెన్షన్ల పంపిణీకి సిద్ధం

పీలేరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ రూ. 4.12 కోట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ శివ శంకర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీ పెన్షన్ల పంపిణీకి అవసరమైన నగదు సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు డోర్ టూ డోర్ పెన్షన్లు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 9715 పెన్షన్లు ఉన్నాయని, కొత్తగా మరో 174 పెన్షన్లు మంజూరైనట్లు చెప్పారు. కొత్తవారిలో ఇదివరకే పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వారి భార్యకు ఆగస్టు నుంచి కొత్త పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు.

దండుమారెమ్మకు పూజలు



దండుమారెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దర్శకుడు తదితరులు

మదనపల్లె అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముదివేడు దండుమారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సినిమా షూటింగ్ ప్రారంభించినట్లు దర్శకుడు డేరింగుల సుధాకర్ ప్రకటించారు. గురువారం ప్రొడక్షన్ నెంబర్ వన్ చిత్రీకరించి పూజలు నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఏపీ ఫిల్మ్ ఫెడరేషన్, కృషి ఎంటర్‌టైన్మెంట్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు మదనపల్లె పరిసర ప్రాంతాల్లో సన్ని వేశాలు చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీనివాసులు, రమేష్, మధుకొరెడ్డి, సుధాకరరెడ్డి, ప్రొడ్యూసర్ పి.రమేష్, మీడియా కో-ఆర్డినేటర్ ఉమేష్‌రాజు, ప్రొడక్షన్ మేనేజర్స్ వి.మహేంద్ర, జమినీ గణేష్, బాల కృష్ణారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తప్పిన పెనుప్రమాదం



ఆటోపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

పీలేరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటోపైకి కంకర లోడుతో ఉన్న ఓ ట్రాక్టరు దూసుకెళ్లిన సంఘటన గురువారం ఉదయం మొరవపడ్డిపల్లె వద్ద జరిగింది. తలపుల నుంచి పీలేరుకు వస్తున్న ఆటోపైకి పీలేరు నుంచి తలపులకు వెళుతున్న ట్రాక్టరు దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయిపోయింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న జాండ్లకు చెందిన షకీలా, రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లెకు చెందిన ప్రభావతి, ఆటో డ్రైవర్ వేపులబైలు వాసి సురేష్ ఉన్నారు. వారు ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడడంతో పెనుప్రమాదం తప్పింది. వారిని పీలేరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న సాయి లోకేశ్, తదితరులు

పీలేరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): గాలివారిపల్లెలోని నూతన సీతారామ సమేత అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ పాల్గొన్నారు. ఆయనతోపాటు జిల్లా ఉపా ధ్యక్షుడు కృష్ణాయాదవ్, రాజంపేట నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ జగదీశ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకుమునుపు ఆలయాన్ని తిరు పతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్‌సీ ముని కృష్ణ, టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ సందర్శించారు.

అరుదైన అవకాశం కొందరికే సొంతం

కలకడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): చదివిన పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయులుగా పని చేసే అవకాశం దక్కడం కొందరికే సొంతమని వక్తలన్నారు. బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకటాచారిని ఉపాధ్యాయులు, మిత్రబృందం, విద్యార్థులు సన్మానించారు. 36 ఏళ్లపాటు ఉపాధ్యాయ వృత్తిలో వివిధ పాఠశాల్లో విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, లోకజగన్నాథశాస్త్రి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి అలంకారం - మరొకటి ఆగిన నిర్మాణం

లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయాలు ఇలా..

వాల్మీకిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వంలో 14గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సచివాలయానికి రూ.35లక్షలు ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. అయితే మండలంలో వివిధ పంచాయతీలకు 12సచివాలయాల భవనాలు, నిర్మాణాలు పూర్తి చేసుకుని ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన రెండు సచివాలయాలు కాలయాపన చేసి సరిపెట్టేశారన్న విమర్శలు సైతం లేకపోలేదు. పట్టణంలోని సచివాలయం-2 భవనం నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. మొండి గోడలను తలపిస్తూ దుస్థితికి చేరడం గమనార్హం. అసాంఘిక కార్యకలాపాలు ఈ సచివాలయ భవనాలు అడ్డాగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని టి.సాకిరేవుపల్లెలో నిర్మించిన సచివాలయ భవనం అన్ని హంగులు పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోక పోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపుల విషయంలో సచివాలయ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదని తెలిసింది. ఇలా వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాల భవనాల తీరు ఇప్పటికీ ఇలాగే కొనసాగుతుండడం, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ మనోహర్ రాజును వివరణ కోరగా సచివాలయాల స్థితిగతులు, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



టి.సాకిరేవుపల్లెలో ప్రారంభానికి నోచుకోని సచివాలయం



వాల్మీకిపురంలో నిలిచిపోయిన సచివాలయ నిర్మాణం

టీసీఎస్ కంపెనీ రాకను అడ్డుకున్న జగన్

తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ



మాట్లాడుతున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌తేజ, రమేశ్

మదనపల్లె టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి టీసీఎస్ కంపెనీ రాకుండా వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి అడ్డుకున్నారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ ఆరోపించారు. గురువారం స్థానిక టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీసీఎస్ కంపెనీపై ఆయన కోర్టులో కేసు వేశారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు తక్కువ ధరలకే వారికి భూములు కేటాయించి ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబును జగన్ విమర్శించడం తగదన్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్ మాట్లాడుతూ వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తుంటే అది చూసి ఓర్వలేక జగన్ ప్రపంచ బ్యాంకులకు మెయిల్ పంపుతూ రాష్ట్రానికి నష్టం కలిగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జగన్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగు యువత నేతలు అయూబ్‌బాషా, జశ్వంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.